Follow: @ANNTELUGU
16-07-2025
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 223 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## డిగ్రీలు కాదు... స్కిల్స్ అవసరం

- ప్రస్తుత పరిస్థితుల్లో సక్సెస్ కు ఇదే మంత్రం
- విద్యార్థులకు మంత్రి శ్రీధర్ బాబు దిశా నిర్దేశం



02

## ముస్లింలను తొలగిస్తేనే బీసీ బిల్లుకు మద్దతు

- 10% ముస్లిం రిజర్వేషన్లతో బీసీలకు తీవ్ర అన్యాయం
- బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తాం: కేంద్ర మంత్రి బండి సంజయ్
- బనకచర్లపై తెలంగాణ వాదనను గట్టిగా వినిపించాలి
- రాజకీయాలకు అతీతంగా బనకచర్ల విషయంలో సీఎంకు అండగా ఉంటాం



02

## తీన్మార్ మల్లన్నకు సిట్ పిలుపు

- ఫోన్ ట్యాప్ కేసులో వాంగ్మూలం ఇవ్వాలని సూచన



03



# శుభ స్వాగతం

### సురక్షితంగా పుడమికి చేరుకున్న శుక్లా అండ్ టీమ్

### వ్యోమగాములను సేఫ్‌గా భూమికి తీసుకొచ్చిన డ్రాగన్ గ్రేస్ క్యాప్సూల్

**మహా:** అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని భారత కీర్తి పతాకాన్ని సమున్నతంగా ఎగరేసిన మన ముద్దుబిడ్డ శుభాంశు శుక్లా పుడమికి తిరిగొచ్చాడు. శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములతో ISS నుంచి బయల్దేరిన క్రూ డ్రాగన్ సీ213 'గ్రేస్' క్యాప్సూల్ ఇవాళ అంటే జులై 15న మధ్యాహ్నం 3.01 గంటలకు కాలిఫోర్నియా తీరంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. జూన్ 26, 2025న భారత వైమానిక దళ టెస్ట్ పైలట్ గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టి చరిత్ర సృష్టించాడు. 39 ఏళ్ల వయసున్న శుక్లా ఐఎస్ ఎస్ కు వెళ్లిన తొలి భారతీయుడిగా, 634వ వ్యోమగామిగా ఘనత పొందారు.

వివరాలు 7లో



## దేశంలో పెరుగుతున్న పెళ్లికాని యువత

- తెలంగాణలో 47.5 శాతం
- ఏపీలో 43.7 శాతం యుక్తవయసు పెళ్ళికి దూరం
- పెళ్ళి కంటే సంపాదన.. జీవితలక్ష్యాలపైనే మోజు

వివరాలు 3లో



## రేవంత్ రెడ్డి.. ఇదే నా ఛాలెంజ్

- కాంగ్రెస్ నుండి ఒక్కరిని కూడా అసెంబ్లీకి రానివ్వ
- నల్గొండ నుండి ఒక్కడినే ఉన్నా.. ఒక్కటి కూడా లేకుండా చేస్తా
- మా ప్రభుత్వం హయాంలో పంచిన రేషన్ కార్డుల సంఖ్య 6,47,479
- నిజమైతే వచ్చినోళ్ల చెంప నేను పగలకొడతా.. తప్పు అయితే నన్ను కొట్టండి
- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

వివరాలు 3లో



## కళ్ళల్లో కారం చల్లి

- తుపాకీతో కాల్చి చంపారు
- హైదరాబాద్‌లో పట్టపగలే దారుణం

వివరాలు 2లో



## చైనా-భారత్ ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతి

వివరాలు 4లో

# భర్తలూ.. భద్రం బీకేర్ ఫుల్



### తేడాలొస్తే చంపేస్తున్న భార్యలు

### ఇటీవల కాలంలో వరుస ఘటనలు

ఉత్తరప్రదేశ్ లో అధికంగా భర్తలను హత్య చేసిన భార్యలు

గత 5 సంవత్సరాలలో 785 మంది భర్తల హతం..

**స్పెషల్ డెస్క్, మహా :**

ఏడడుగుల సంబంధం.. సతీ అనసూయ వంటి ఎన్నో సినిమాలు భర్త కోసం భార్యలు చేసే పోరాటాలు, త్యాగాలు కనిపిస్తాయి. పురాణాలు.. రాముడు, సీత వైవాహిక బంధ ఔన్నత్యానికి, సమాజ ఐక్యతకు చిహ్నంగా ఉంటారు. సోషల్ మీడియా యుగం, వైపరీత్యాలు, అసమానతలు, కోరికలే గుర్రాలై పరుగెడుతున్న వేళ ఎన్నో దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. నల్లగొండ జిల్లా లో ఓ మహిళ కిరాయి కారుతో భర్తను గుద్ది చంపింది. ఓ మహిళ సెల్ఫీ పేరుతో భర్తను నదివరకు తీసుకెళ్ళి తోసేసింది. ఇలాంటి సంఘటనలు జరిగాక భర్తలూ.. జర భద్రం అంటూ సింగిల్స్ డబుల్స్ ను హెచ్చరిస్తున్నారు. అక్రమ సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, ఇష్టం లేని పెళ్ళి చేయడంతో కాపురం చేయలేక భర్తలను భార్యలు హత్య చేయడం రోజుకో చోట జరుగుతోంది.

మిగతా 2లో

# గవర్నర్ వద్దకు ఆర్డినెన్స్

### స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు వీలుగా ఆర్డినెన్స్

- 285 క్లాజ్ఎ సెక్షన్‌లో 50 శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగించాలని చట్టసవరణ
- ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ అమలుకు సర్కారు నిర్ణయం
- ముఖ్యమంత్రి ఆమోదంతో రాజ్‌భవన్‌కు ఆర్డినెన్స్




**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా సర్కారు నిర్ణయంతో రాజ్‌భవన్‌కు చేరింది. పంచాయతీరాజ్ చట్టం2018లో సవరణల ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపించింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే 285 క్లాజ్ఎ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా అమలవుతాయని ఉంది.

మిగతా 2లో

# చర్చల్లేవ్...

### బనకచర్ల నిబంధనలకు విరుద్ధం

### ఏపీకి తెలంగాణ షాక్

కేంద్రానికి లేఖ రాసిన తెలంగాణ ప్రభుత్వం

ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్న ఏపీ సీఎం చంద్రబాబు



02

### మల్నాడు రెస్టారెంట్ యజమాని

# సూర్య డ్రగ్స్ దందా

- చెప్పుల్లో డ్రగ్స్ పెట్టి సరఫరా.. ఏడు పబ్ లకు నోటీసులు
- నిందితుల్లో ఇద్దరు పోలీస్ ఉన్నతాధికారుల కుమారులు
- పక్కా సమాచారంతో 8 మందిని అరెస్టు చేసిన నార్కొటిక్స్ బ్యూరో
- నిందితుల్లో సైబరాబాద్ డీసీపీ, ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ కుమారులు

03



### ఏసీబీ వలకు

# మరో ఇరిగేషన్ పెద్ద చేప

### మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు నివాసంలో ఏసీబీ రైడ్స్

- ఈఎన్సీగా పని చేస్తూ భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆరోపణ
- హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్‌లలో 10 చోట్ల అధికారుల సోదాలు
- పలు డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న ఏసీబీ ఆఫీసర్స్
- రిటైర్డ్ అయ్యాక కూడా విధులు నిర్వహించిన మురళీధర్ రావు
- తన కుమారుడు బినామీలకు లబ్ధి చేకూరేలా వ్యవహరించినట్లు సమాచారం

**హైదరాబాద్, మహా:** నీటిపారుదల శాఖ మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్ రావు ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారుల సోదాలు చేపట్టారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంతో పాటు హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్‌లలోని బంధువులు, సన్నిహితుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలోనే పదవీ విరమణ పొందిన మురళీధర్ రావు పదవీకాలాన్ని 13 ఏళ్లు పొడిగించారు.

మిగతా 2లో





## 18 నెల్లోనే 3 లక్షల కోట్ల పెట్టుబడులు

### మా పోటీ రాష్ట్రాలతో కాదు.. ప్రపంచ దేశాలతో

### ప్రపంచ బల్క్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుంటోంది

- పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం
- జీనోమ్ వ్యాలీ తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చింది: సీఎం రేవంత్
- ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన సీఎం

**శామీర్‌పేట, మహా:** హైదరాబాద్ శామీర్‌పేట జీనోమ్‌వ్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడారు. జీనోమ్‌వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకు గుర్తింపు తెచ్చాయని సీఎం కొనియాడారు.

మిగతా 2లో

# భర్తలూ.. భద్రం బీకేర్ ఫుల్

(మొదటిపేజీ తరువాయి)

తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నప్పటికీ జాతీయ నేర రికార్డుల ప్రకారం ఉత్తరప్రదేశ్ లో ఎక్కువ మంది భార్యలు భర్తలను హత్య చేసి మొదటి స్థానాన్ని సంపాదించుకున్నట్లు తేలింది. జాతీయ నేర రికార్డుల ప్రకారం.. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం భర్తల మరణాలలో మొదటి స్థానంలో ఉంది. 2020 సంవత్సరంలో ఇక్కడ 45 మంది భర్తలు భార్యల చేతుల్లో హతులయ్యారు. 2021లో ఈ సంఖ్య 52 కు చేరుకోగా, 2022లో 60 కి పెరిగింది. 2023లో 55కు తగ్గగా, 2024 లో 62 కు ఎగబాకింది. అదే విధంగా బీహార్ రాష్ట్రంలో 2020లో 30, 2021లో 35, 2022లో 40, 2023లో 39, 2024లో 42 మంది భర్తలు భార్యల చేతుల్లో హతమయ్యారు. రాజస్థాన్ రాష్ట్రంలో 2020 సంవత్సరంలో 20, 2021 సంవత్సరంలో 25, 2022 సంవత్సరం లో 28, 2023 సంవత్సరంలో 30, 2024 సంవత్సరంలో 35 మంది భర్తలు హతమయ్యారు. మహారాష్ట్రలో 2020 సంవత్సరంలో 15, 2021లో 18, 2022 లో 20,2023లో 22, 2024లో 25 మంది భర్తలు హతమయ్యారు.మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 2020లో 12 మంది, 2021లో 15 మంది,2022లో 18 మంది,2023లో 20 మంది, 2024లో 22 మంది భర్తలు భార్యల చేతిలో హతమైనట్లు రికార్డులు వెల్లడించాయి. ఇటీవల కాలంతో తెలంగాణ, ఏపీ, నార్త్, సౌత్ తేడాల్లేవ్.. ఓటీటీ సినిమా అన్ని భాషల్లో వచ్చినట్లు నేరాలోచనలు పెడధోరణలు అన్ని ప్రాంతాల్లో పెరుగుతున్నాయి. వీటిని కట్టడిచేయకుంటే, ముందుముందు మరిన్ని దారుణాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది.



# ముస్లింలను తొలగిస్తేనే బీసీ బిల్లుకు మద్దతు

## 10 శాతం ముస్లిం రిజర్వేషన్లతో బీసీలకు తీవ్ర అన్యాయం

### బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తాం..కేంద్ర మంత్రి బండి సంజయ్

### బనకచర్లపై తెలంగాణ వాదనను గట్టిగా వినిపించాలి

### రాజకీయాలకు అతీతంగా బనకచర్ల విషయంలో సీఎంకు అండగా ఉంటాం

**కరీంనగర్, మహా :** బీసీల రిజర్వేషన్ల అమలుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు పేరుతో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం దుర్మార్గమన్నారు. ముస్లింలను బీసీ రిజర్వేషన్ల జాబితా నుండి తొలగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. తక్షణమే బీసీ జాబితా నుండి ముస్లింలను తొలగించి 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకే దక్కేలా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 51 శాతమున్న బీసీలకు 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం 12 శాతమున్న ముస్లింలకు మాత్రం వందకు వంద శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సిద్ధమవడం దుర్మార్గమన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రం రెండు రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయడాన్ని స్వాగతించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ వాదనను బలంగా విన్పించాలని కోరారు. ఈరోజు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే టెన్త్ విద్యార్థులందరికీ సైకిళ్లను అందజేస్తున్నామన్నారు. బనకచర్ల ప్రాజెక్టు అంశంపై కేంద్ర ప్రభుత్వం రేపు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం కాబోతోందని, ఈ నేపథ్యంలో తెలంగాణ వాదనను బలంగా వినిపించాలన్నారు. కేంద్రానికి అన్ని రాష్ట్రాలూ సమానమేనని, ఏ రాష్ట్రానికి అన్యాయం చేయదన్నారు. ఇప్పటికే కేంద్రం ఈ విషయాన్ని స్పష్టం ప్రకటించిందన్నారు. బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగకుండా సమష్టిగా కృషి చేద్దామని, ఈ విషయంలో రాష్ట్ర వాదనను సీఎంల మీటింగ్ లో రేవంత్ రెడ్డి గట్టిగా వినిపించాలన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, ప్రభుత్వం వాస్తవాలను కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. కొన్ని బీసీ సంఘాలు ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ బీసీలకు అన్యాయం చేస్తున్నాయన్నారు. వైఎస్ హయాంలో ముస్లింలను బీసీల్లో చేర్చి 4 శాతం రిజర్వేషన్లను అమలు చేశారని, అప్పుడే బీసీ సంఘాలు అడ్డుకుని ఉంటే బీసీలకు అన్యాయం జరిగేది కాదన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇస్తేనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని, ఇప్పుడు 10 శాతం ఇస్తామంటున్నారన్నారు. వాస్తవానికి బీసీ జనాభా రాష్ట్రంలో 51 శాతం ఉందని, సమగ్ర కుటుంబ సర్వేలోనే ఈ విషయాన్ని తేల్చారన్నారు. కానీ



కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన పేరుతో బీసీల జనాభాను 46 శాతానికి తగ్గించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెబుతూ అందులో 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు అమలు చేస్తుందని, తద్వారా బీసీలకు దక్కే రిజర్వేషన్లు 32 శాతమేనని వివరించారు. మోదీ ప్రభుత్వం ఇప్పటికే బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అదనంగా ఇస్తున్న రిజర్వేషన్లు 5 శాతమేనని వివరించారు. దీనివల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. అట్లాగే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలవుతున్నాయని, అందులో ముస్లింలు లబ్ది పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో 12 శాతం ముస్లింలుంటే కాంగ్రెస్ 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా ముస్లింలకు ఇకపై వందకు వంద శాతం రిజర్వేషన్లు పొందబోతున్నారన్నారు. బీసీలకు మాత్రం తీవ్రమైన అన్యాయం జరగబోతోందని, మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమైనా ఆర్డినెన్స్ తీసుకువస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. ముస్లింలకు వందకు వందశాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నప్పుడు బీసీ జనాభా దామాషా ప్రకారం బీసీ వర్గాలకు ఎందుకు రిజర్వేషన్లు కల్పించరని ప్రశ్నించారు. తక్షణమే బీసీ రిజర్వేషన్ల జాబితా నుండి ముస్లింలను తొలగించాలని సంజయ్ డిమాండ్ చేశారు. 42కు 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు అమలు చేస్తానంటే కేంద్రాన్ని ఒప్పించి ఆమోదం తెలిపే బాధ్యతను మేం తీసుకుంటామని, లేనిపక్షంలో ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీసీ సంఘాల నేతలు తమ దురాలోచనను, రాజకీయాలను పక్కనపెట్టి బీసీలకు జరుగుతున్న అన్యాయంపై మాట్లాడాలని సంజయ్ కోరారు. గుండెపై చేయి వేసుకుని వాస్తవాలు మాట్లాడాలని బీసీ సంఘాల నేతలను సంజయ్ కోరారు. కాంగ్రెస్ కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముస్లింలను బీసీ జాబితా నుండి తొలగించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# చర్చల్లేవ్

## బనకచర్ల నిబంధనలకు విరుద్ధం

- ఏపీకి తెలంగాణ షాక్
- కేంద్రానికి లేఖ రాసిన తెలంగాణ ప్రభుత్వం
- ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్న ఏపీ సీఎం చంద్రబాబు

**హైదరాబాద్, మహా :** బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు సిద్ధంగా లేమని, అసలు ప్రాజెక్టే నిబంధనలకు విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. చర్చలకు కేవలం యొక రజు గడువు ఉన్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వం రాసిన లేఖ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బనకచర్ల ప్రాజెక్ట్ పై చర్చించడానికి తాము ఎంతమాత్రం సిద్ధంగా లేమని తేల్చి చెప్పింది. బనకచర్ల సింగిల్ పాయింట్ అజెండాతో దేశ రాజధానిలో జరిగే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం నేపథ్యంలో తెలంగాణ ఈ వాదన లేవదీయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ.. లేఖ సైతం రాసింది. బుధవారం ఢిల్లీలో జరగనున్న అంతర్‌రాష్ట్ర సమావేశం అజెండాలో బనకచర్ల ప్రాజెక్టును చేర్చడంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్ట్ నిబంధనలకు విరుద్ధమని, దీనిపై చర్చించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. కేంద్ర జల్ శక్తి మంత్రి సమక్షంలో ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డితో ఈ సమావేశం ఏర్పాటైంది. ఇందులో పాల్గొనడానికి చంద్రబాబు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ పరిస్థితుల మధ్య తెలంగాణ ప్రభుత్వం తాజాగా లేఖ రాయడం ముఖ్యమంత్రుల సమావేశం నిర్వహణపై సందేహాలు లేవనెత్తినట్టయింది. 82,000 కోట్ల రూపాయల గోదావరిబనకచర్ల నదుల అనుసంధాన ప్రాజెక్టుపై మాత్రమే చర్చించాలని ఏపీ ప్రభుత్వం జల్ శక్తి మంత్రిత్వ శాఖకు సింగిల్ అజెండాను సమర్పించిన విషయం తెలిసిందే. తెలంగాణ మాత్రం దీనికి భిన్నంగా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన వేర్వేరు అజెండాలను కేంద్రానికి పంపింది. ఇందులో కృష్ణా నదిపై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల



కు అనుమతి ఇవ్వడం, పాలమూరురంగారెడ్డి, డిండి ప్రాజెక్టులకు జాతీయ ప్రాజెక్టుల హోదా కల్పించడంతో పాటు వాటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని కేంద్రమే చేయడం, తుమ్మిడిహెట్టి వద్ద పూర్తయిన ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీలు కేటాయింపును ఇందులో చేర్చింది.

దీనితో పాటు త్వరితగతిన సాగునీటి పథకాల ప్రయోజన కార్యక్రమం కింద తెలంగాణకు అన్ని రకాల సహాయ, సహకారాలను అందించడం, 200 టీఎంసీల వరద నీటిని వినియోగించుకోవడానికి ఇచ్చంపల్లి వద్ద కొత్త ప్రాజెక్టును నిర్మించడానికి అనుమతులు మంజూరు చేయడం వంటివి ఇందులో ఉన్నాయి. బనకచెర్ల ప్రాజెక్టుపై ఎటువంటి చర్చకు కూడా తాము సిద్ధంగా లేమని, దీనిపై చర్చించడాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నామని తాజాగా కేంద్రానికి లేఖ పంపిన లేఖలో తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. బనకచర్ల ప్రాజెక్టుకు చట్టబద్ధమైన అనుమతులు లేనందున దీనిపై చర్చించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. గోదావరిబనకచెర్ల అనుసంధాన ప్రాజెక్టుకు గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, సెంట్రల్ వాటర్ కమిషన్, ఎక్స్‌పర్ట్ అప్రైసల్ కమిటీ వంటి నియంత్రణ సంస్థల నుండి తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని లేఖలో పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు ఎటువంటి అనుమతులు లభించలేదని, చట్టపరమైన, ట్రిబ్యునల్ నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయని వివరించింది. బనకచర్లపై ఎటువంటి చర్చ అయినా అనుచితమని, కేంద్ర నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తుందని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. చట్టపరమైన ప్రక్రియలు, అంతర్‌రాష్ట్ర ప్రోటోకాల్‌లు పాటించే వరకు బనకచెర్లపై చర్చలకు సిద్ధంగా లేదని తెలంగాణ స్పష్టం చేస్తోంది.

# గవర్నర్ వద్దకు ఆర్డినెన్స్

(మొదటిపేజీ తరువాయి)

అందులో 50 శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ చట్టాన్ని సవరించాలని నిర్ణయించారు.

**న్యాయశాఖ ఆమోదం**

పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు హైకోర్టు విధించిన గడువు సెప్టెంబర్ 30 సమీపిస్తున్నందున ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ అమలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పంచాయతీ రాజ్ శాఖ ఈ ఫైలును న్యాయశాఖ ఆమోదించిన తర్వాత మంత్రి, ముఖ్యమంత్రి ఆమోదంతో ప్రభుత్వం రాజ్‌భవన్‌కు ఆర్డినెన్స్ ముసాయిదాగా పంపించింది.

**బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు**

ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం పొందితే చట్ట సవరణ వెంటనే అమల్లోకి రానుంది. దీనికి అనుగుణంగా బీసీ డెడికేటెడ్ కమిషన్ స్థానిక సంస్థలకు రిజర్వేషన్లను సిఫార్సు చేయనుంది. వాటి ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి, స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు పంపించనుంది. పంచాయతీ ఎన్నికలను సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ హైకోర్టు గడువు విధించిన సంగతి తెలిసిందే. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన నేపథ్యంలో కాంగ్రెస్ బీసీ నేతలు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఇతర నాయకులు వేర్వేరుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.



**సామాజిక బహిష్కరణ చేస్తాం**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకే ఇంతకాలం స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేశామన్న సీఎం రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచొద్దని గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం చేసిందని రేవంత్ రెడ్డి తెలిపారు. అప్పుడు మంత్రులుగా ఉన్న బీసీలు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లతోనే కేసీఆర్ తమపై విమర్శలు చేయించారని ఆక్షేపించారు. అందరు కలిసి కట్టుగా రక్షణ కవచంలా ఉండి రిజర్వేషన్లను కాపాడుకోవాలని సూచించారు. ఎవరైనా కోర్టుకు వెళ్తే వాదించడానికి ఢిల్లీ నుంచి ఉద్దండులైన న్యాయకోవిదులను నియమిస్తామని చెప్పారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాగితం పెట్టినవారిని, వాళ్లతో పెట్టించినవారిని సామాజిక బహిష్కరణ చేస్తామని ప్రకటించాలంటూ బీసీలకు పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ఎంపీలతో పాటు ఇండియా కూటమి ఎంపీలకు త్వరలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు.

# డిగ్రీలు కాదు... స్కిల్స్ అవసరం

## ప్రస్తుత పరిస్థితుల్లో సక్సెస్ కు ఇదే మంత్రం

### విద్యార్థులకు మంత్రి శ్రీధర్ బాబు దిశా నిర్దేశం

**హైదరాబాద్, మహా :** 'ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంతో పాటు మనం కూడా మారాలి. కాలం చెల్లిన జ్ఞానాన్ని విడిచిపెట్టి, నిరంతరం నూతన విషయాలను నేర్చుకుంటూ ముందుకు సాగాలి. అప్పుడే సక్సెస్ మనల్ని వరిస్తుంది' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'లెర్న్, అన్ లెర్న్, రీ లెర్న్' అనేది ఇప్పుడు సక్సెస్ కు ఫార్ములా అని వివరించారు. మంగళవారం మాసబ్ ట్యాంక్ లోని తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన "మన అమెరికన్ తెలుగు సంఘం (మాట) టాస్క్ ఫ్రీ ఆన్ లైన్ ఐటీ ట్రైనింగ్" సర్టిఫికేట్ల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. 'ఒకప్పటిలా చేతిలో డిగ్రీ ఉంటే ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదు. 50 శాతం మంది గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలకు అవసరమైన స్కిల్స్ లేవని నాస్కామ్ గుర్తించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్ లో కనీస అవగాహన ఉండటం లేదని తేల్చింది' అని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. 'ఆటోమేషన్ వల్ల ఉద్యోగాలు కనుమరుగైపోతాయనే ఆందోళన వద్దు. 2025 నాటికి 8.5 కోట్ల ఉద్యోగాలు రోబోలు, ఏఐ వల్ల పోతే... కొత్తగా 9.7 కోట్లు పుట్టుకొస్తాయని వరల్డ్ ఎకానమిక్ ఫోరం తేల్చింది' అని చెప్పారు. 'చేతిలో డిగ్రీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్ పై పట్టు ఉంటేనే కొత్త ఉద్యోగాలను సాధించలేరు. క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, టీం వర్క్, అడాప్టబిలిటీ, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ లాంటి స్కిల్స్ కూడా అవసరం. ఆ దిశగా విద్యార్థి దశ నుంచే కృషి చేయాలి' అని సూచించారు. 'లక్ష్యం అంటూ



లేని జీవితం చిరునామా లేని లెటర్ లాంటిది. విద్యార్థి దశలోనే ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. ఆ దిశగా నిరంతరం పరిశ్రమించాలి. అపజయాలకు కుంగిపోవొద్దు. తప్పులను సరిదిద్దుకొని మరింత శ్రమించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో స్మార్ట్ వర్క్ తో కూడిన హార్డ్ వర్క్ చేస్తేనే సక్సెస్ వస్తుంది' అని వివరించారు. 'సాంప్రదాయబద్ధంగా కాకుండా వినూత్నంగా ఆలోచించండి. కొత్త ఆలోచనలకు మేం ఎల్లప్పుడూ అండగా ఉంటాం. స్కిల్ కేపిటల్ ఆఫ్ గ్లోబ్ గా తెలంగాణను మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. నైపుణ్యాభివృద్ధి కోసం మా ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్ వంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలి. సమాజం కోసం కూడా ఆలోచించాలి' అని సూచించారు. మాట చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాట ప్రతినిధులు శ్రీనివాస్, ప్రదీప్, విజయ్ భాస్కర్, నగేష్, కళ్యాణి, డా.విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్లల్లో కారం చల్లి.. తుపాకీతో కాల్చి చంపారు

## హైదరాబాద్‌లో పట్టపగలే దారుణం..

**హైదరాబాద్, మహా :** మలక్‌పేట శాలీవాహననగర్ పార్క్ లో మంగళవారం ఉదయం కాల్పులు కలకలం రేపాయి. దుండగులు జరిపిన కాల్పుల్లో సీపీఐ నేత చందూరాథోడ్ అక్కడికక్కడే మృతి చెందాడు, భార్యతో కలిసి వాకింగ్‌కి వెళ్లిన చందూరాథోడ్‌పై దుండగులు 4 రౌండ్ల పాటు కాల్పులు జరిపారు. వెంటనే రాథోడ్ కుప్పకూలి మరణించాడు. ఈ ఘటనతో పరిసర ప్రాంతాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. నగరం ఉలిక్కి పడేలా జరిగిన దాడితో పోలీసులు అప్రమత్తమయ్యారు. శాలివాహననగర్ లో నివసించే రోథోడ్ సీపీఐలో చురుకైన నాయకుడు. ఇతడికి చాలా కాలంగా అదే పార్టీకి చెందిన రాజేష్‌తో విబేధాలున్నాయి. అతనే ఈ దారుణానికి పాల్పడి ఉండొచ్చని, రాథోడ్ కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటకి చెందిన చందూ రాథోడ్ కుటుంబంతో కలిసి కొంతకాలంగా నగరంల నివసిస్తున్నాడు. ఈ క్రమంలో మలక్‌పేట్‌లోని శాలీవాహననగర్ పార్క్ లో భార్యతో కలిసి వాకింగ్ కు వెళ్లాడు. వాకింగ్ చేసి ఇంటికి వెళ్తున్న సమయంలో.. రాథోడ్‌పై దుండగులు కాపు కాచి కాల్పులు జరిపారు. స్నేహితులతో కలిసి నడుచుకుంటూ వెళ్తుండగా స్వఫ్ట్ కారులో వచ్చిన అగంతకులు ముందు మృతుడి కళ్లలో కారం చల్లారు.. ఆ తర్వాత పరిగెత్తుతున్న అతడిని వెంటాడి వెంబడించి గన్‌తో 4 రౌండ్ల కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.. ఆపై కారులో దుండగులు పరారయ్యారు. రాథోడ్ పై ఐదుగురు వ్యక్తులు కలిసి కాల్పులు జరిపినట్లు స్థానికులు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చందూ హత్యకు పాతకక్షలు కారణంగా ప్రాథమిక అంచనా వచ్చారు.

**నా భర్త ముందే చెప్పాడు..**

తాము వాకింగ్ చేస్తున్న సమయంలో అక్కడి ఓ కారులో కొంతమంది వచ్చారని మృతుడి భార్య నారిబాయ్ చెప్పారు. అది గమనించిన నేను వాళ్ళు ఇక్కడికి ఎందుకు వచ్చారని నా భర్తను అడిగానని, వెంటనే వాళ్ళని చూసిన నా భర్త డల్ అయ్యారని చెప్పింది. అక్కడి నుంచి తమని వెళ్ళమని ఆయన చెప్పాడని ఆ కారులో రాజేష్, సుధాకర్ తో పాటు మరికొంత మంది ఉన్నారని ఆమె చెప్పారు. అయితే రాజేష్ మాజీ మావోయిస్టు అని, అతని వద్ద గన్స్ ఉన్నాయని తన భర్త చాలా సార్లు చెప్పేవారని అన్నారు. కుంట్లూరు గుడిసెల వ్యవహారంలో రాజేష్ డబ్బులు వసూలు చేసేవాడని, ఇదే అంశంపై అతడిని తన భర్త మందలించి పార్టీ దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. ఈ కోపంతోనే తన భర్తను వాళ్ళు చంపారని.. తన భర్తను ఎలా కాల్చి చంపారో.. నిందితులను కూడా అలానే కాల్చి చంపాలని చందు నాయక్ భార్య నారిభాయ్ డిమాండ్ చేశారు. కాగా ఇప్పటికే దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు.

**నిందితుల కోసం10 బృందాలు ఏర్పాటు చేశాం : డీసీపీ చైతన్య**

సీపీఐ ఎంఎల్ పార్టీలో పని చేసిన చందునాయక్ రెండు సంవత్సరాల క్రితం సీపీఐలో చేరారు. 2022 లో ఎల్ బీ నగర్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడిగా ఉన్నారని తెలిసింది. ఇదిలా ఉండగా, ఘటనకు కారకులని అనుమానిస్తున్న రాజేష్ తో పాటు సుధాకర్, మరో ఇద్దరు ఎస్ వోటీ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలుస్తోంది. హత్యకు కారణం భూ తగాదాలా లేక పాతకక్షలా అన్నది తేలాల్సి ఉందని డీసీపీ చైతన్య తెలిపారు. నిందితులను పట్టుకోవడం కోసం 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఘటన జరిగిన ప్రాంతంలో ఐదు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నామని, స్వాధీనం చేసుకున్న బుల్లెట్లను పరిశీలిస్తే వెపన్ తో ఫైరింగ్ చేసినట్లు ఉందన్నారు. ఘటన జరిగిన ప్రాంతంతో పాటు సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నామని, నిందితులు ఉపయోగించిన కారును కూడా గుర్తించడం జరిగిందన్నారు. వీలైనంత తొందరగా నిందితులను అరెస్టు చేస్తామన్నారు.

# 18 నెలల్లోనే.. 3 లక్షల కోట్ల పెట్టుబడులు



(మొదటిపేజీ తరువాయి)

దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్‌వ్యాలీ నుంచి ఉత్పత్తి చేస్తున్నట్టుగా చెప్పారు. ప్రపంచమంతా కోవిడ్ భయం ఉన్న సమయంలో జీనోమ్‌వ్యాలీ నుంచి వ్యాక్సిన్ల ఉత్పత్తి జరిగినట్టుగా చెప్పారు. ప్రపంచ దేశాలకు సరఫరా చేసినట్టుగా వెల్లడించారు. రాష్ట్రంలో ఉత్తమ పారిశ్రామిక విధానం అమలు చేస్తామని, 18 నెలల్లోనే 3 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు తెచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తమ రాష్ట్రాలతో కాదు.. ప్రపంచ దేశాలతో పోటీ పడాలన్నది ప్రయత్నమని, ప్రపంచ బల్క్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుంటోందని ముఖ్యమంత్రి అన్నారు.

**తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా ముందుకు..**

'రాబోయే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యం. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా ముందుకెళ్తాం. ఇందుకోసం జీనోమ్‌వ్యాలీ పారిశ్రామిక వేత్తల సహకారం ఉండాలి.' అని రేవంత్ రెడ్డి అన్నారు. అంతకుముందు మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి మాట్లాడారు. జీనోమ్‌వ్యాలీ ఆసియాఖండంలోనే ప్రత్యకమైన గుర్తింపు పొందినదని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లో ఉందని చెప్పారు. ఉద్యోగాల కల్పన కోసం తమ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. స్కిల్ యూనివర్సిటీ పెట్టిందే యువత కోసమని చెప్పారు. ఎక్కువ పరిశ్రమలు స్థాపించి.. ఎక్కువ ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. యువతకు ఉపాధి కోసమే పెట్టుబడుల ప్రయత్నమని, అన్ని రంగాల్లో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

# ఏసీబీ వలకు మరో ఇరిగేషన్ పెద్ద చేప

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొన్నాళ్లు కొనసాగిన ఆయనను మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక తర్వాత ప్రభుత్వం తొలగించింది.

**మురళీధర్ రావు కీలక పాత్ర?**

అయితే ఇప్పటికే మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ఇన్‌చీఫ్ (ఈఎన్‌సీ) హరి రామ్, ఈఈ నూనె శ్రీధర్‌లను అరెస్టు చేసిన ఏసీబీ.. తాజాగా మురళీధర్ రావును సైతం అదుపులోకి తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో మురళీధర్ రావు కీలక పాత్ర పోషించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో మంగళవారం ఉదయం నుంచే ఏసీబీ అధికారులు బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో సోదాలు ప్రారంభించారు. హైదరాబాద్ నగరంతో పాటు కరీంనగర్, జహీరాబాద్ ప్రాంతాల్లో మొత్తం 10 చోట్ల ఏకకాలంలో సోదాలు కొనసాగుతున్నాయి. ఇందులో మురళీధర్ రావు కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లు కూడా ఉన్నట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి.

**సోదాల్లో భారీగా అక్రమాస్తులు..**

ఈ సోదాల్లో భారీగా అక్రమాస్తులను ఏసీబీ గుర్తించినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టులో సబ్‌కాంట్రాక్టుల కేటాయింపుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఏసీబీ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం నిధులను తన కుమారుడు అభిషేక్ రావుకు చెందిన సొంత కంపెనీల హర్ష కన్‌స్ట్రక్షన్ కు మళ్లించినట్లు తెలుస్తోంది. కాళేశ్వరంతో పాటు పాలమూరులోను భారీగా సబ్ కాంట్రాక్ట్‌లు చేశారని, తన కుమారుడు అభిషేక్ బినామీలకు లబ్ధి చేకూరేలా మురళీధర్ రావు వ్యవహరించినట్లు సమాచారం. వర్క్ ఆర్డర్స్ జారీలోనూ మురళీధర్ రావు అకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి.





## దేశంలో పెరుగుతున్న పెళ్లికాని యువత

- తెలంగాణలో 47.5 శాతం
- ఏపీలో 43.7 శాతం యుక్తవయసు పెళ్ళికి దూరం
- పెళ్ళి కంటే సంపాదన.. జీవిత లక్ష్యాలపైనే మోజు

**మహా నెట్ వర్క్ :** దేశంలో పెళ్లి కాని యువత సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉన్నత విద్య, ఉద్యోగాలు, వ్యక్తిగత నిర్ణయాలు వంటి కారణాల వల్ల వివాహాలు ఆలస్యమవుతున్నాయి. యుక్త వయసు జనాభాలో 51.1 శాతం మంది పెళ్లి చేసుకోలేదని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో పురుషులు 56.3 శాతం, మహిళలు 45.7 శాతంగా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలో 47.5 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 43.7 శాతం పెళ్లికాని వారు ఉన్నారని జనాభా లెక్కల విభాగం వెల్లడించింది. యుక్త వయసు వచ్చిన వారు పెళ్ళిపై కాకుండా సంపాదన, తన జీవిత లక్ష్యం తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడమే ప్రధాన కారణమని కూడా తేలింది.

## మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్య డ్రగ్స్ దందా

- చెప్పల్లో డ్రగ్స్ పెట్టి సరఫరా.. ఏడు పబ్ లకు నోటీసులు
- నిందితుల్లో ఇద్దరు పోలీస్ ఉన్నతాధికారుల కుమారులు
- పక్కా సమాచారంతో 8 మందిని అరెస్టు చేసిన నార్కొటిక్స్ బ్యూరో
- నిందితుల్లో సైబరాబాద్ డీసీపీ, ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ కుమారులు

**హైదరాబాద్ సిటీ బ్యూరో, మహా**



హైదరాబాద్‌లోని కొంపల్లిలో డ్రగ్స్ దందా సంచలం రేపుతుండగా, మల్నాడు డ్రగ్స్ ఫైల్స్ లో కొత్త కోణాలు బయటికొస్తున్నాయి. మహిళల చెప్పులలో డ్రగ్స్ పెట్టి సరఫరా చేస్తున్న మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్య డ్రగ్స్ దందా కేసు దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ కేసులో 8 మందిని అరెస్ట్ చేయగా కేసులో ఏ2 గా ఉన్న పల్లెపాక మోహన్ ఓ పోలీసు ఉన్నతాధికారి కుమారుడు కాగా పరారీలో ఉన్న మరో నిందితుడు రాహుల్ తేజ్ కూడా పోలీసు అధికారి కుమారుడు కావడం సంచలనంగా మారింది.

**స్కార్పియో డాష్ బోర్డులో డ్రగ్స్**

హైదరాబాద్ కొంపల్లిలోని మల్నాడు రెస్టరెంట్ నిర్వాహకుడు సూర్య వద్ద మాదకద్రవ్యాలున్నాయనే సమాచారంతో ఇటీవల సైబరాబాద్ ఈగల్ టీమ్ పోలీసులు బృందం రెస్టారెంట్ వద్ద నిఘా ఉంచింది. ఈనెల 7న రాత్రి రెస్టారెంట్‌కు స్కార్పియోలో వచ్చిన సూర్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతని స్కార్పియో డాష్ బోర్డులో డ్రగ్స్ ఉన్నట్లు అంగీకరించాడు. తనిఖీ చేయగా 3.2 గ్రాముల ఐజీ వీడ్, 1.6 గ్రాముల 3 ఎక్టసీ మాత్రలు లభించాయి. అనంతరం కారు ఫ్రంట్ సీట్ కింద దాచిన పార్సిల్ వెతకగా మహిళల చెప్పులు లభ్యమయ్యాయి. చెప్పు హీల్ లోపల 10గ్రాముల కొకైన్ దొరికింది. వాటితో పాటు నిందితుడి ఐఫోన్, స్కార్పియో కారును పోలీసులు జప్తు చేశారు. పబ్‌లో మాదకద్రవ్యాలు సేవించినట్లు అంగీకరించిన సూర్య పోలీసుల విచారణలో పలు అంశాలను వెల్లడించాడు. దర్యాప్తు చేసి సూర్యతో సహా మరో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

**డీసీపీ, అదనపు ఎస్పీల కుమారులు :**

ఈగల్ టీం దర్యాప్తులో నిందితుల్లో ఇద్దరు పోలీసు అధికారుల కుమారులు ఉండటంతో ఈ ఘటన విస్మయానికి గురిచేస్తోంది. ఈ కేసులో A2గా ఉన్న పల్లెపాక మోహన్ తండ్రి సంజీవరావు సైబరాబాద్ కీలక వింగ్‌కు డీసీపీగా ఉన్నారు. పరారీలో ఉన్న రాహుల్ తేజ్ తండ్రి వేణుగోపాల్ ఇంటలిజెన్స్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్నారు.

**7 పబ్ లకు నోటీసులు**

ఖాజాగూడలో నివాసం ఉంటున్న పల్లెపాక మోహన్ తరచూ బెంగళూరులో ఉండే నైజీరియన్ జెర్రీ నుంచి మాదకద్రవ్యాలను కొనుగోలు చేసి సూర్యకు సరఫరా చేస్తున్నట్లు ఈగల్ టీమ్ పోలీసులు గుర్తించారు. నైజీరియన్ల నుంచి మాదకద్రవ్యాలను కొనుగోలు చేసి, వాటిని పబ్స్, రెస్టారెంట్ల ద్వారా విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కేసులో మొత్తం 25 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసులో ఇప్పటికే 7 పబ్ లకు నోటీసులు జారీ చేశారు. ఆరుగురు నిందితులను కస్టడీకి కోరారు.

## రేవంత్ రెడ్డి.. ఇదే నా ఛాలెంజ్

### కాంగ్రెస్ నుండి ఒక్కరిని కూడా అసెంబ్లీకి రానివ్వా

- నల్గొండ నుండి ఒక్కడినే ఉన్నా.. ఒక్కటి కూడా లేకుండా చేస్తా
- మా ప్రభుత్వం హయాంలో పంచిన రేషన్ కార్డుల సంఖ్య 6,47,479
- నిజమైతే వచ్చినోళ్ల చెంప నేను పగలకొడతా.. తప్పు అయితే నన్ను కొట్టండి
- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** తుంగతుర్తి సభపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుల పంపిణీ పేరు మీద తుంగతుర్తిలో ప్రభుత్వ ఖర్చుతో సభకు జనాలను తీసుకొచ్చారు.. అది పూర్తిగా అధికారిక కార్యక్రమని వ్యాఖ్యానించారు. నేను రేవంత్ రెడ్డి స్థాయికి దిగజారను.. సీఎం ఎంత మొత్తుకున్నా సభలో జనం నుంచి స్పందన లేదని విమర్శించారు. సీఎం అబద్ధాలు మాట్లాడుతుంటే ప్రజలు ఎందుకు స్పందిస్తారు? అని ప్రశ్నించారు. బూతులు తిడితేనైనా స్పందిస్తారని సీఎం బూతులకు తెగబడ్డారని దుయ్యబట్టారు. సీఎంకు సంస్కారం, బుద్ధి పెరగలేదని మండిపడ్డారు. సీఎం మాట్లాడిన మాటలు చూసి జనం నవ్వుకుంటున్నారని, కేసీఆర్ హయంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని సీఎం అబద్ధాలు మాట్లాడారని అన్నారు. జూలై 2021లో ప్రతిపక్ష నేతగా భట్టి విక్రమార్క తన నియోజకవర్గంలో రేషన్ కార్డులు పంచినట్టు అప్పట్లో ట్వీట్ చేశారని, ఇప్పటి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎంపీగా బీఆర్ఎస్‌లో ఉన్నపుడు రేషన్ కార్డుల పంపిణీ గురించి ప్రతికల్లో ప్రకటనలు ఇచ్చారని చెప్పారు.

**6.47 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం..**

'చౌటుప్పల్‌లో అప్పటి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సమక్షంలో నేను రేషన్ కార్డులు పంచాను. 6.47 లక్షల రేషన్ కార్డులను కేసీఆర్ హయాంలో పంచాం. నా వాదనను తప్పని నిరూపిస్తే చెంప దెబ్బ కొట్టించుకోవడానికి సిద్ధం. కాంగ్రెస్ నేతలు చెంప దెబ్బలు తినడానికి సిద్ధం కావాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని ఏళ్ళు అవుతున్నా రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురుచూడటం ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ వైఫల్యం వల్ల కాదా?. గతంలో కేసీఆర్ జిల్లా పర్యటనలకు వచ్చినపుడు కొత్త కార్యక్రమాలు ప్రకటించేవారు. సీఎం తుంగతుర్తిలో తిట్లు తప్ప ఏమీ ఇవ్వలేదు. కాంగ్రెస్, టీడీపీ పాలన వల్లే నల్లగొండలో ఫ్లోరోసిస్ మహమ్మారి 2 లక్షల మందిని కబళించింది. నీళ్ల విషయంలో అన్యాయం చేసి మళ్ళీ ఏవో చెబుతున్నారు. మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించే నల్లగొండను 40 లక్షల మెట్రిక్ టన్నుల స్థాయికి తీసుకెళ్లింది కేసీఆర్ కాదా?. వ్యవసాయాన్ని నల్లగొండ జిల్లాలో కేసీఆర్ పండగలా మార్చారు. కాంగ్రెస్ పాలన వచ్చాక ఒక్క ఎకరాకు అయినా అదనంగా నీరొచ్చిందా?. నల్లగొండ జిల్లాకు వచ్చిన కాళేశ్వరం జలాలకు కేసీఆర్ హారతి ఇచ్చిన దృశ్యాలు చూడలేదా?' అంటూ కామెంట్స్ చేశారు.

**మళ్ళీ ఫ్యాక్షన్ రోజులు తెస్తున్నారు..**

'మూడు మెడికల్ కళాశాలలు జిల్లాకు తెచ్చింది కేసీఆర్ కాదా?. యాదాద్రిని అద్భుత దైవక్షేత్రంగా తీర్చిదిద్దింది కేసీఆర్ కాదా?. ఎన్నికల కోసం వేసిన రైతు భరోసా పాతది.. యాసంగిది, వానాకాలంది వేయాలి. రైతాంగానికి ఇంకా 27 వేల కోట్ల రూపాయలు రేవంత్ ప్రభుత్వం బాకీ ఉంది. కాంగ్రెస్, టీడీపీ పాలనలో నల్గొండ పల్లెల పరిస్థితి ఎలా ఉండేది.. కేసీఆర్ వచ్చాక ఎలా అయిందో ప్రజలకు తెలియదా?. తుంగతుర్తిలో సీఎం వచ్చే కన్నా ముందు కూడా కాంగ్రెస్ నేతలు తన్నుకున్నారు.. మళ్ళీ ఫ్యాక్షన్ రోజులు తెస్తున్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉద్యోగాల భర్తీ విషయంలో రేవంత్ రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే' అని అన్నారు.

## తీన్మార్ మల్లన్నకు సిట్ పిలుపు

### ఫోన్ ట్యాప్ కేసులో వాంగ్మూలం ఇవ్వాలని సూచన

**హైదరాబాద్, మహా:** పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సిట్ నుంచి పిలుపు వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇవ్వాలని ఆయనను కోరింది. గురువారం లోపు జూబ్లీహిల్స్ పీఎస్‌లో స్టేట్‌మెంట్ ఇవ్వాలని తీన్మార్ మల్లన్నకు సిట్ సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసిన సిట్... వారి నుంచి కీలక సమాచారాన్ని రాబట్టింది. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావించిన మాజీ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ టి. ప్రభాకర్ రావుని కూడా ఇటీవలే అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ కేసులోని మూలాలను వెలికి తీసే పనిలో అధికారులు ఉన్నారు.

## కాంగ్రెస్ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు

### ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



**మిర్యాలగూడ, మహా:** తుంగతుర్తి సభలో సీఎం రేవంత్ రెడ్డి తన స్థాయిని మరిచి మాట్లాడి ప్రజల్లో అభాస పాలయ్యారని ఎమ్మెల్సీ కోటిరెడ్డి అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసి కాంగ్రెస్ కూడా తన స్థాయిని తగ్గించుకుందని వ్యాఖ్యానించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చేసిన అభివృద్ధి చెప్పుకోవడానికి ఏమీ లేక మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకొని మాట్లాడటం సరైన పద్ధతి కాదని సూచించారు. 20 నెలల్లో రాష్ట్ర అభివృద్ధికి కొత్తగా కాంగ్రెస్ చేసింది లేదని విమర్శించారు. రెండు సార్లు రైతుబంధు ఎగగొట్టి రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. వస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆరోపించారు.



## అక్రమార్కుల నుంచి భూమిని కాపాడండి

**మిర్యాలగూడ, మహా:** మండలంలోని యాద్గార్ పల్లి గ్రామ శివారులోని గంగమ్మ తల్లి గుట్టకు చెందిన భూమి సర్వే చేసి ఆక్రమించేందుకు కొంత మంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, దానిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి రాములు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో కొందరు వ్యక్తులు గుట్ట భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, విచారణ జరిపి చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.రామకృష్ణ, బడుగుల లింగయ్య, ఎం.సైదులు, పీ.మల్లయ్య, సీహెచ్ శేఖర్, రవికాంత్, కేశయ్య, వెంకటయ్య ఉన్నారు.

## ఓబీసీ సలహా.. మండలి సమావేశాలకు రాష్ట్ర నేతలు

### హాజరైన పీసీసీ చీఫ్, పొన్నం, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి తదితరులు



**బెంగుళూరు, మహా:** బెంగుళూరులో ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బెంగుళూరుకు చేరుకున్న రాష్ట్ర నేతలకు కర్ణాటక లీడర్లు స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు తెలంగాణ నుంచి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ మధు యాష్కీ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విజయంతంగా పూర్తి చేసిన కులగణన, 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుపై ఇందులో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ప్రసంగించనున్నారు. అలాగే దేశవ్యాప్తంగా ఓబీసీల సమస్యలు, వాటి పరిష్కారం, ఈ వర్గాల విషయంలో మోదీ సర్కార్ అవలంబిస్తున్న విధానాలపై ఇందులో ప్రధానంగా చర్చించనున్నారు.

## సామాన్యుడిలా సీఎం రేవంత్!

- ఎకానమీ క్లాస్‌లో ప్రయాణం చేస్తూ ఢిల్లీకి
- సోషల్ మీడియాలో ఫోటోలు వైరల్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఢిల్లీ వెళ్తున్న సందర్భంగా సీఎం మరోసారి సామాన్యుడిలా ఎకానమీ క్లాస్‌లో ప్రయాణం సాగించారు. దీంతో ఆ ఫొటోలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రజల సీఎం అంటే ఇలా ఉంటారని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఏపీ నిర్మించ తలపెట్టిన బనకచర్ల వివాదంపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులతో భేటీ నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సమావేశానికి హాజరయ్యేందుకు ఏపీ సీఎం చంద్రబాబు సుముఖంగా ఉండగా తెలంగాణ ప్రభుత్వం మాత్రం తాము వచ్చేది లేదని తేల్చిచెప్పింది. అయితే ఈ సమావేశం ఎజెండా మారిస్తే తాము కూడా హాజరవుతామని కేంద్ర మంత్రికి సిఎం రేవంత్ రెడ్డి తెలపగా.. ఈ హుటాహుటి ప్రయాణానికి కారణం మాత్రం ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశమేనని రాజకీయాల్లో చర్చ నడుస్తోంది.

## జర్నలిస్టులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

### వర్కింగ్ జర్నలిస్టులకు కల్పిస్తున్న ఉచిత హెల్త్ స్కీమ్ పొడిగింపు
### 2025 -26 ఏడాదికి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ

**అమరావతి, మహా:** జర్నలిస్టులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వర్కింగ్ జర్నలిస్టులకు కల్పిస్తున్న ఉచిత హెల్త్ స్కీమ్ పథకం 2025 26 ఏడాదికి పొడిగించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జర్నలిస్ట్ సోదరులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో గుర్తింపు పొందిన వర్కింగ్ జర్నలిస్టులకు నగదు రహిత చికిత్స అందించే లక్ష్యంతో ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వం జీవోలో తెలిపింది. ఈ పథకం జర్నలిస్ట్, జీవిత భాగస్వామి, పిల్లలకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) తరహాలో వర్తిస్తుందని వివరించింది.



## నిరుపయోగంగా స్లీపింగ్ మిషన్!

**మిర్యాలగూడ, మహా:** మున్సిపాలిటీ ఆవరణలో స్లీపింగ్ మిషన్ మ్యూజియంలో బొమ్మలా నిరుపయోగంగా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ పాలకవర్గం సుమారు రూ. 60 లక్షల వ్యయంతో కొనుగోలు చేసింది. మున్సిపాలిటీలో శాశ్వత, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు ఉన్న కూడా స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేశారు. మిషన్‌తో ఒక రోజూ ఊడ్చిన దాఖలాలు లేవు. ఊడిస్తే ప్రధాన తారు రోడ్డు మాత్రమే.. ఊడ్చేటప్పుడు దాని ద్వారా లేచే దుమ్ముతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు.

## సమరానికి సై

### మరోసారి రాజాసింగ్ పై మాధవీలత ఫైర్.. తనను కించపరిచేలా మాట్లాడారని వ్యాఖ్య
### ఎన్నికల్లో రాజాసింగ్ తనకు సహకరించకున్నా ఎక్కువ ఓట్లు వచ్చాయన్న నేత

**హైదరాబాద్, మహా :** ఇటీవల బీజేపీకి గుడ్ బై చెప్పిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పై ఆ పార్టీ నాయకురాలు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాధవీలత విమర్శలు గుప్పించారు. బీజేపీ మద్దతు లేకుండానే రాజాసింగ్ ఎమ్మెల్యేగా గొలుపొందారా? అని ప్రశ్నించారు. కార్పొరేటర్ గా ఉన్న రాజాసింగ్ ను ఎమ్మెల్యే చేసింది బీజేపీనే అని చెప్పారు. బీజేపీ గురించి ఏది పడితే అది మాట్లాడటం సరికాదన్నారు. ఇతర మతాల వారిని, మహిళలను దూషించడమే హిందుత్వమా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన తనకు రాజాసింగ్ సహకరించలేదని మాధవీలత విమర్శించారు. ఎంపీ అభ్యర్థిగా మగాళ్లే దొరకలేదా? అంటూ తన గురించి హేళనగా మాట్లాడారని మండిపడ్డారు. గోషామహల్ లో రాజాసింగ్ కంటే తనకే ఎక్కువ ఓట్లు వచ్చాయని అన్నారు. మాధవీలత బలహీనురాలు కాదని చెప్పారు. గోషామహల్ స్థానాన్ని తనతో భర్తీ చేయాలని హైకమాండ్ భావిస్తుండటం తన అదృష్టమని అన్నారు. గోషామహల్, జూబ్లీహిల్స్ ఎక్కడ పోటీ చేయమన్నా బరిలోకి దిగేందుకు తాను సిద్ధమని చెప్పారు.

## బీసీలను విడదీసే కుట్ర జరుగుతుంది

### కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేసింది
### బీసీలు ఏకతాటి పైకి రావాలి.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్, మహా :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బీసీ రిజర్వేషన్ అంశంపై తీవ్రంగా స్పందించారు. ఇందిరా పార్కు వద్ద బీఆర్ఎస్ చేపట్టిన బీసీ ధర్నాకు హాజరైన తలసాని మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీలను విడదీసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. సాధ్యం కాని విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పడం విడ్డూరమన్నారు. బీసీలు తలుచుకుంటే రాజకీయ భూకంపం వస్తుందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో బీసీలంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళతామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పై గతంలో పలువురు ముఖ్యమంత్రులు తీర్మానాలు చేశారని గుర్తు చేశారు. కానీ రిజర్వేషన్ల అంశం రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో పెడితే తప్ప అది సాధ్యం కాదని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై అప్పుడే అంతా అయిపోయినట్లుగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి సన్మానం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

## 26 నుంచి 30 వరకు సింగపూర్ పర్యటనకు ఏపీ సీఎం చంద్రబాబు

### తోడుగా మంత్రులు లోకేష్, నారాయణ, ఎంపీ భరత్.. ఇన్‌ఛార్జ్ సీఎంగా పవన్ కళ్యాణ్ ?

**అమరావతి, మహా :** ఈ నెల 2630 వరకు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నాలుగు రోజుల పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇన్‌ఛార్జ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. ఆయనతోపాటు మంత్రులు నారా లోకేశ్, నారాయణ, టీజీ భరత్ కూడా సింగపూర్‌కు వెళ్లే అవకాశం ఉంది. చంద్రబాబు పర్యటనలో ప్రధానంగా ఏపీలో నిర్మితమవుతున్న రాజధాని అమరావతి, పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు తదితరాలపై అక్కడి వ్యాపార దిగ్గజాలతో వరుస భేటీలు జరుగనున్నాయి.

## మెదక్ కాంగ్రెస్ యువనేత హత్యలో ట్విస్టులు

### యాక్సిడెంట్ అని హాస్పిటల్ తీసుకెళ్తే బుల్లెట్ గాయాలు ..
### రియల్ ఎస్టేట్ వ్యాపారులతో వివాదమే కారణమా?



**సంగారెడ్డి, మహా :** మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతరకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు మరెల్లి అనిల్ (28) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్ నుంచి సొంతూరికి తన కారులో వస్తుండగా వరిగుంతం సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిల్ ప్రాణాలు విడిచాడు. ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కుల్చారం ఎస్సై గౌస్ మంగళవారం ఉదయం ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లి చూడగా, ఘటనా స్థలంలో నాలుగు బుల్లెట్లు లభ్యమయ్యాయి. దీంతో అనిల్ రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని ముందు భావించినా, బుల్లెట్లు లభించడంతో ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. అనిల్ కుడి భుజం నుంచి 2 బుల్లెట్లు దూసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. చనిపోయే ముందు అనిల్ తన చేతిపై ఓ ఫోన్ నంబర్ రాసినట్లు తెలిపారు. అయితే అనిల్‌పై ఎవరు కాల్పులు జరిపారు? ఎందుకు జరిపారు? హత్యనా? లేక ఆత్మహత్యనా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో ఉన్నట్లు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అనిల్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో విభేదాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని ఓ 6 గుంటల భూమి విషయంలో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థతో వివాదం ఉందని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ మేరకు అనిల్ హత్యకు ఈ భూ వివాదమే కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## భట్టికి లీగల్ నోటీసులు

### నోటీస్ పంపిన బీజేపీ స్టేట్ -చీఫ్ రామచందర్‌రావు
### రోహిత్ వేముల ఆత్మహత్య ఇష్యూపై కామెంట్స్ చేసిన డిప్యూటీ సీఎం
### బేషరతుగా మూడు రోజుల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు లీగల్ నోటీసులు పంపారు. హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు రామ్‌చందర్ రావే కారణమంటూ భట్టి విక్రమార్క ఆరోపణలు చేశారని, బేషరతుగా మూడు రోజుల్లో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భట్టి విక్రమార్క క్షమాపణలు చెప్పకపోతే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని, రూ.25 లక్షలకు పరువు నష్ట దావా వేస్తామని హెచ్చరించారు. తన అడ్వకేట్ విజయ కాంత్‌తో రామచందర్‌రావు నోటీసులు పంపారు. గతంలో కోర్టు ఇచ్చిన తీర్పు కాపీని రామచందర్‌రావు తరుపు అడ్వకేట్ అటాచ్ చేశారు.

**భట్టి చేసిన వ్యాఖ్యలు..**

కాగా, ఇటీవల ఢిల్లీలో భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారంటూ కామెంట్లు చేశారు. రామచందర్‌రావుకు ఆ పదవి ఇవ్వడంపై బీజేపీ పెద్దలు పునరాలోచన చేయాలని చెప్పారు. రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై తమ సర్కారు విచారణ జరుపుతోందన్నారు. అంతేగాక, రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని చెప్పారు. 2016లో వర్సిటీ యాజమాన్యం రోహిత్ వేములపై చర్యలు తీసుకునేలా రామచందర్‌రావు ఆందోళన చేశారన్నారు.

## భార్య చికెన్ తినలేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్య

**మహా:** తమిళనాడులో దారుణం జరిగింది. భార్య చికెన్ తినేందుకు నిరాకరించిందని నవ వరుడు మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. ఇక వివరాల్లోకి వెళ్తే.. తంజావూరు జిల్లాలోని కుంభకోణం తాలుకాలో సక్కోట్టై ప్రాంతంలో మణికంతన్ (29) ఉంటున్నాడు. ఇతను ఫర్నిచర్ దుకాణంలో పనిచేసేవాడు. అయితే తనతో కలిసి పనిచేసే సుబలక్ష్మీ(25) అనే అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. నెల రోజుల క్రితం తల్లిదండ్రులను ఎదురించి చెన్నైలోని ఓ ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత ఈ నవదంపతులు తిరప్పూల్ జిల్లా వెల్ల కోవిల్ పుత్తూరులోని సుబలక్ష్మీ సోదరి మేనక ఇంటికి వెళ్లారు. అప్పటినుంచి అక్కడే ఉంటున్నారు. అయితే మేనక, తన భర్త ఆదివారం ఓ ఆలయ ప్రత్యేక కార్యక్రమం కోసం తిరచ్చుకి వెళ్లారు. దీంతో మణికంఠన్ దుకాణం నుంచి చికెన్ తీసుకొచ్చాడు. భార్యను తినమని అడిగాడు. కానీ సుబ్బలక్ష్మీ ఇందుకు ఒప్పుకోలేదు. తన సోదరి గుడికి వెళ్లినందువల్ల ఇంట్లో చికెన్ తినేందుకు ఆమె నిరాకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేసిన మణికంఠన్ ఇంటి బయట ఇనుప కడ్డీకి చీరతో ఉరేసుకొని సూసైడ్ చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న స్థానికులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే మణికంఠన్ మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు.

EDITORIAL సంపాదకీయం



# తెలంగాణలో మహిళా సాధికారతకు ఆశాకిరణం



- పాతులోతు పాండు నాయక్
9885333196

తెలంగాణ రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు (SHGలు) వడ్డీ లేని రుణాల పంపిణీ ఒక పెద్ద పండుగలా జరుగుతోంది. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, మహిళలు తమ వ్యాపారాలను ప్రారంభించడానికి లేదా విస్తరించడానికి, తద్వారా ఆర్థికంగా స్వాతంత్ర్యం పొందడానికి ఒక బలమైన పునాది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనే" ఆశయానికి అనుగుణంగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) సమర్థవంతమైన నాయకత్వం ఈ కార్యక్రమాలకు ఒక కొత్త దిశానిర్దేశం చేస్తోంది. ఆమె సారథ్యంలో మహిళా సంఘాలకు విజయవంతంగా ఆర్థిక సహాయం అందుతోంది, వారి వ్యాపారాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇది నిజంగా హర్షించదగ్గ పరిణామం.

**నారీశక్తికి ప్రోత్సాహం**

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ ద్వారా తెలంగాణ ప్రభుత్వం నారీశక్తిని ప్రోత్సహిస్తోంది. మహిళల కోసం మహాలక్ష్మి పథకం (ఉచిత RTC బస్సు ప్రయాణం) మరియు అమ్మ ఆదర్శ పాఠశాల వంటి కార్యక్రమాలు కూడా వారికి ఆర్థికంగా మరియు సామాజికంగా మద్దతునిస్తున్నాయి. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందించడంలో మంత్రి సీతక్క కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవల రూ. 344 కోట్ల వడ్డీ లేని రుణాలను విడుదల చేయాలనే నిర్ణయం, ఆమె కృషికి నిదర్శనం. ఈ నిధులలో గ్రామీణ మహిళా సంఘాలకు రూ. 300 కోట్లు, పట్టణ మహిళా సంఘాలకు రూ. 44 కోట్లు కేటాయించడం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల మహిళలకు లబ్ధి చేకూరుతుంది. ఈ ఆర్థిక సహాయం మహిళలు తమ చిరు వ్యాపారాలను ప్రారంభించడానికి లేదా ఇప్పటికే ఉన్న వ్యాపారాలను విస్తరించడానికి దోహదపడుతుంది. చిన్న చిన్న మొత్తాలు కూడా మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచి, వారిని స్వయం సమృద్ధి దిశగా నడిపిస్తాయి. పొదుపు చేసుకున్న డబ్బుతోనో, కుటుంబ సభ్యుల సహాయంతోనో వ్యాపారం చేయాలనుకునే ఎంతో మంది మహిళలకు ఈ వడ్డీ లేని రుణాలు పెద్ద ఊరట. ఇది ఆర్థిక భారం లేకుండానే తమ కలలను సాకారం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తుంది.

**మంత్రి సీతక్క దార్శనికతతో మహిళా సంఘాల వ్యాపార వికాసం**

మంత్రి సీతక్క కేవలం ఆర్థిక సహాయం అందించడానికే పరిమితం కాకుండా, మహిళల వ్యాపార అభివృద్ధికి అనేక వినూత్న చర్యలు చేపడుతున్నారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజ్ సపోర్ట్ కింద రూ. 21,000 కోట్లు కేటాయించడం, SHG సభ్యుల సంఖ్యను కోటికి పెంచడానికి వయోపరిమితి సడలించడం వంటివి ఆమె దార్శనికతను తెలియజేస్తాయి. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం, నూతన వ్యాపార అవకాశాలను అన్వేషించడంలో వారికి శిక్షణ ఇవ్వడం వంటివి ఆమె లక్ష్యాలలో భాగం. అంతేకాకుండా, ఆమె ఆధ్వర్యంలో మహిళా సంఘాలను సాంప్రదాయేతర రంగాలలోకి ప్రోత్సహిస్తున్నారు. ఉదాహరణకు, రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు, ఈబస్సుల నిర్వహణ, పెట్రోల్ బంకులు, ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాంలు కుట్టడం వంటి రంగాలలో మహిళా సంఘాలను ప్రోత్సహించడం ద్వారా వారికి అదనపు ఆదాయ మార్గాలను సృష్టించడం జరుగుతుంది. ఇది కేవలం ఆర్థిక లబ్ధి మాత్రమే కాదు, మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారడానికి, వివిధ రంగాలలో తమ సత్తా చాటడానికి ఒక గొప్ప వేదికను అందిస్తుంది.

**ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా మంత్రి సీతక్క కార్యాచరణ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనే" దార్శనికతను సాకారం చేయడానికి మంత్రి సీతక్క అంకిత భావంతో పనిచేస్తున్నారు. మహిళల సమగ్ర వికాసం కోసం మంత్రి సీతక్క చేస్తున్న కృషి ప్రశంసనీయం. ఆర్థిక సాధికారతతో పాటు, ప్రమాద బీమా, లోన్ బీమా వంటి భద్రతా వలయాలను కూడా ఆమె నిర్మిస్తున్నారు. ఈ చర్యలు మహిళలు ధైర్యంగా ముందడుగు వేయడానికి, ఆర్థిక భద్రతను పొందడానికి దోహదపడతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మంత్రి సీతక్క పని చేయడం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా మహిళల ఉన్నతికి ఎంతో దోహదపడుతుందని చెప్పడంలో సందేహం లేదు. ఆమె నాయకత్వంలో తెలంగాణ మహిళలు ఆర్థికంగా మరింత బలంగా మారి, రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు అవుతారని ఆశించవచ్చు. ఆమె నాయకత్వంలో మహిళా సంఘాలకు అందించే సహాయం కేవలం ఆర్థిక వృద్ధికి మాత్రమే



కాకుండా, సామాజిక సాధికారతకు కూడా దారితీస్తుంది. మహిళలు ఆర్థికంగా బలంగా ఉన్నప్పుడు, కుటుంబాలలో, సమాజంలో వారి స్థానం మరింత పటిష్టమవుతుంది. ఇది లింగ సమానత్వాన్ని సాధించడంలోనూ, సమాజ పురోగతిలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. మంత్రి సీతక్క సమర్థవంతమైన నాయకత్వం, ఆమె చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు తెలంగాణ మహిళల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నాయి. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా బలం చేకూర్చి, సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుంది. ఈ చర్యలన్నీ మహిళల ఆర్థిక సాధికారతను పెంపొందించడానికి, వారిని పారిశ్రామికవేత్తలుగా మార్చడానికి, తద్వారా తెలంగాణను ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో కీలక పాత్ర పోషించాలని ప్రభుత్వం ఆశిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మహిళలు ఆర్థిక క్రమశిక్షణకు రోల్‌మోడల్స్ అని, కార్పొరేట్ కంపెనీలు భారీ రుణాలను ఎగవేసినప్పటికీ, మహిళా SHGలు చిన్న మొత్తాలను కూడా సమయానికి తిరిగి చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. సకాలంలో రుణాలు తిరిగి చెల్లించడం అనేది మహిళలు తమ వ్యాపారాలను విజయవంతంగా నడపగలరని, ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధించగలరని నిరూపిస్తుంది. ఇది వారి ఆర్థిక సాధికారతకు ఒక బలమైన పునాది. ఆర్థిక క్రమశిక్షణ వల్ల మహిళా సంఘాలపై బ్యాంకులు, ప్రభుత్వం, ఇతర ఆర్థిక సంస్థలకు నమ్మకం పెరుగుతుంది. ఇది భవిష్యత్తులో వారికి మరిన్ని రుణాలను, ఆర్థిక సహాయాన్ని అందించడానికి ప్రోత్సాహాన్నిస్తుంది.

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించే వడ్డీ లేని రుణాల పథకం నిలిచిపోయిన విషయం అందరికీ తెలిసిందే. అంతేకాకుండా, ఆ సమయంలో సుమారు రూ. 3,000 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయి మహిళా సంఘాల ఆర్థిక కార్యకలాపాలకు కొంత ఆటంకం ఏర్పడింది. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, వడ్డీ లేని రుణాల చెల్లింపుపై మళ్లీ నిర్ణయం తీసుకుంది.

ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వం కేవలం బకాయిలను క్లియర్ చేయడమే కాకుండా, ప్రతి సంవత్సరం రూ. 20,000 కోట్లకు తగ్గకుండా వడ్డీ లేని రుణాలను అందిస్తామని కూడా ప్రకటించింది. మహిళా సంఘాలకు, గ్రామీణ ప్రాంతాలకు ఒక పెద్ద ఊరటనిచ్చాయని, గతంలో నిలిచిపోయిన పథకానికి తిరిగి జీవం పోశారని కాంగ్రెస్ ప్రభుత్వం మరియు దాని నాయకులు చెబుతున్నారు. ఈ విషయంలో మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకున్నారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు, ఇది మహిళా సాధికారతకు ఊతం లభించిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా, మహిళా SHGలు కేవలం రుణాలు తీసుకునే వినియోగదారులుగా కాకుండా, బాధ్యతాయుతమైన ఆర్థిక భాగస్వాములుగా నిరూపించుకుంటున్నాయి. వారి ఈ క్రమశిక్షణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూరుస్తుంది మరియు ఇతర వర్గాలకు కూడా ఒక ఆదర్శంగా నిలుస్తుంది. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి స్వయంగా గుర్తించి ప్రశంసించడం మహిళా సంఘాల ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. మరిన్ని మహిళా సంఘాలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని, తమ వ్యాపారాలను విజయవంతంగా నడుపుతాయని ఆశిద్దాం.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# చైనా-భారత్ ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతి

**మహా డెస్క్:**

భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మంగళవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలవగా, ఇటీవలి కాలంలో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో జరిగిన పరిణామాల పై చర్చించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తరఫున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయాన్ని జైశంకర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. ఇది జరిగిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి.

**గల్వాన్ ఘర్షణల తర్వాత**

2020 గల్వాన్ ఘర్షణ తర్వాత తొలిసారి షాంఘైకో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు కోసం జైశంకర్ చైనాలో పర్యటిస్తున్నారు. సోమవారం చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ , విదేశాంగమంత్రి వాంగ్ యీతో భేటీ అయిన ఆయన, చైనాభారత్ సంబంధాలు క్రమంగా బలపడుతున్నట్లు వివరించారు. ద్వైపాక్షిక సంబంధాలు, సహకారాలను మరింత బలోపేతం చేసుకోవడం వల్ల ఇరుదేశాలతో పాటు ప్రపంచానికి కూడా ప్రయోజనకరమని అభిప్రాయపడ్డారు. చైనా వైపు నుంచి ప్రవహించే సరిహద్దు నదుల్లో నీటికి సంబంధించిన సమాచారాన్ని అందించడంపై జైశంకర్ వారితో చర్చించారు. "సరిహద్దు సమస్యలను పరిష్కరించడం, ప్రజల రాకపోకలను సాధారణీకరించడం, నిర్బంధ వాణిజ్య చర్చలను, అడ్డంకులను నివారించడం మా బాధ్యత. పరస్పర గౌరవం, ఆసక్తులు, సున్నితత్వం ఆధారంగా ద్వైపాక్షిక సంబంధాలు సానుకూల పథంలో అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నాము. టియాంజియన్‌లో జరిగే ఎస్‌సీఓ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరు కావడానికి ఎదురుచూస్తున్నాము. మంచి ఫలితాలు, నిర్ణయాలను నిర్ధరించడానికి భారత్ కట్టుబడి ఉంది" అని జైశంకర్ అన్నారు.

**సరిహద్దు వివాదాల పరిష్కారం దిశగా**

జూన్ నెలలో భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్‌లు చైనాలో పర్యటించారు. అప్పుడు రాజనాథ్ సింగ్ చైనాలోని క్వింగ్డావోలో జరిగిన షాంఘై సహకార సంస్థ సభ్యదేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సుకు హాజరయ్యారు. ఇప్పుడు విదేశాంగ మంత్రి జైశంకర్ చైనాలో పర్యటిస్తున్నారు. మరోవైపు దశాబ్దాలుగా ఉన్న సరిహద్దు వివాదాన్ని పరిష్కరించే లక్ష్యంతో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ వచ్చే నెల భారత్‌కు రానున్నారు. ఆయన నేరుగా భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్‌తో భేటీ కానున్నారు.

**గల్వాన్ ఘర్షణలు**

2020లో గల్వాన్ లోయ వద్ద భారత్, చైనా సైనికుల మధ్య ఘర్షణ జరిగింది. దీనితో ఇరువైపులా చాలా మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. దీనితో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగి, ద్వైపాక్షిక సంబంధాలు దారుణంగా దెబ్బతిన్నాయి. అయితే గతేడాది అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీ అయ్యారు. సరిహద్దు సమస్యల పరిష్కారం గురించి



చర్చించారు. ఇదే క్రమంలో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతికి నిదర్శనంగా, దాదాపు 5 ఏళ్ల తరువాత కైలాస మానస సరోవర్ యాత్ర పునః ప్రారంభం అయ్యింది.

## సీలింగ్ ఫ్యాన్ కు ఉరేసుకొని యువతి ఆత్మహత్య

**అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**

**అబ్దుల్లాపూర్ మెట్,మహా:** సీలింగ్ ఫ్యాన్ కు ఉరేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ప్రియాంక శ్యామల (18) తండ్రి కపింద్ర శ్యామల తన కుటుంబ సభ్యులతో కలసి బతుకుదెరువు హైదరాబాద్ నగరానికి వలస వచ్చి... రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండలం ఉమర్ఖాన్ గూడ నివాసం ఉంటున్నారు. ప్రియాంక శ్యామల డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. కుటుంబ సభ్యులు తనకు ఇష్టం లేని కాలేజీలో చేర్పించారని.. మనోవేదనకు గురై మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బయటకు వెళ్లి వచ్చిన కుటుంబ సభ్యులు ఇంటికొచ్చి చూసేసరికి తలుపులు మూసి ఉన్నాయి. బయటనుంచి ఎంతసేపు తలుపులు కొట్టిన డోర్లు తీయకపోవడంతో.. ఇంటి తలుపులు పగలగొట్టి చూడగా ప్రియాంక ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. ప్రియాంక కుటుంబ సభ్యులు, స్థానికులు అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అబ్దుల్లాపూర్ మెట్ ఇన్ స్పెక్టర్ వి అశోక్ రెడ్డి తెలిపారు.

# ఉద్యమాలతోనే దోపిడికి అడ్డుకట్ట

- పాలకుల విధానాలతో పెరుగుతున్న అసమానతలు
- ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్
- ఎంసిపిఐ(యు) లో పెద్ద ఎత్తున చేరికలు




**వరంగల్ మహా;** పాలకుల విధానాలతోనే ప్రజల మధ్యన అసమానతలు పెరిగి ప్రజలు దోపిడీకి గురవుతున్నారని అందుకు ప్రత్యామ్నాయంగా ఎర్రజెండా ప్రజా ఉద్యమాల నిర్మాణమే ఏకైక పరిష్కారమని ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. మంగళవారం కామ్రేడ్ మాలోత్ సాగర్, కామ్రేడ్ ముక్కెర రామస్వామి ఆధ్వర్యంలో సుమారు వెయ్యి కుటుంబాల కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా ఎంసిపిఐ(యు) పార్టీలో జాతీయ రాష్ట్ర జిల్లా కార్యదర్శులు మద్ది కాయల అశోక్, ఓంకార్, గాదగోని రవి, పెద్దారపు రమేష్, వీరి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన శంభునిపేటలోని ఆర్ఆర్ గార్డెన్లో జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మద్ది కాయల అశోక్ ఓంకార్ ప్రసంగిస్తూ కమ్యూనిస్టులను, ప్రజా ఉద్యమాలను బలహీనపర్చాలని పాలకులు అన్ని విధాల కుట్రలు చేస్తున్నారని నిర్బంధాలను ప్రయోగించి కుట్ర కేసులు పెడుతున్నారని అయినా సమాజంలో దోపిడి ఉన్నంతకాలం ఎర్రజెండా ఉద్యమాలు ఉంటాయని ఎంత అణగదొక్కితే అంతకు రెట్టింపు స్థితిలో బలపడతాయని అయితే దోపిడి వర్గాలకు ఉన్న ఐక్యత కమ్యూనిస్టుల మధ్యన లేకపోవడం పాలకులకు ఒక వరంగా మారిందన్నారు. సమాజంలోని సంపద అందరికీ సమానంగా దక్కేలా శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా కమ్యూనిస్టులు సామాజిక తరగతులు ప్రజా సంఘాలు ఐక్యంగా ప్రజా ఉద్యమాలను నిర్మిస్తే తప్ప ప్రత్యామ్నాయంగా లభించదని ఈ క్రమంలో ఎంసిపిఐ(యు) కమ్యూనిస్టులు ఐక్యతకు శక్తివంతం లేకుండా కృషి చేస్తున్నదని కార్యకర్తల్లో బలహీనతలను లోటుపాట్లను సరిచేసి సరైన దృక్పథంతో ముందుకు సాగుతుందని తెలిపారు. అనంతరం పార్టీలో మమ్మల్ని సాదరంగా ఆహ్వానించినందుకు పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ జిల్లాలో ప్రజా ఉద్యమాల నిర్మాణానికి తమ వంతు కృషి అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నాయకులు వల్లపు ఉపేందర్ రెడ్డి, గోనె కుమారస్వామి, ఎన్ రెడ్డి హంసారెడ్డి, మంద రవి, నర్ర ప్రతాప్, కన్నం వెంకన్న, వంగల రాగసుధ కనకం సంధ్య మాస్ సావిత్రి గడ్డం నాగార్జున కర్ర రాజిరెడ్డి సుంచు జగదీశ్వర్ నాగెల్లీ కొమురయ్య కొత్తకొండ రాజమౌళి మహమ్మద్ ఇస్మాయిల్ లతోపాటు జిల్లా కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

# చదువు కోసం చాలా కష్టపడ్డాం..

**మాజీ హోంమంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** చదువు కోవడానికి చిన్నపుడు చాలా కష్టపడ్డామని మాజీ హోమం దేవేందర్ గౌడ్ అన్నారు. మా గ్రామంలో మూడవ తరగతి వరకే పాఠశాల ఉండేదని, పై తరగతులకు మరో గ్రామానికి వెళ్లి వచ్చే వాళ్ళమని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం ప్రభుత్వ మహాత్మ జ్యోతిభపూలే మోడల్ స్కూల్ స్థల దాత, డాక్టర్ యాదయ్య గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని, మాజీ హోంమంత్రి దేవేందర్ గౌడ్ ఆవిష్కరించారు. యాదయ్య గౌడ్ కుటుంబ సభ్యులకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ... తుక్కుగూడ పరిధిలో బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో, బీసీ వెల్ఫేర్ పాఠశాలల కోసం ప్రతిపాదన చేసిన వెంటనే నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపాదనను ఆమోదించారు. పాఠశాల నిర్మాణానికి స్థలం లేకపోవడంతో చదువు విలువ తెలిసిన మా కుటుంబ సభ్యులు, పాఠశాల నిర్మాణానికి 10 ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. మా కుటుంబం చదువు కోసం, బడి కోసం చాలా కష్టపడ్డాం, ఆ బాధ ఈ చుట్టుపక్కల వారికి ఉండకూడదని 10 ఎకరాలు సొంత స్థలము బీసీ వెల్ఫేర్ పాఠశాల కోసం ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు ఈ భూమి యొక్క విలువ కోట్లల్లో ఉంటుందని మాజీ హోంమంత్రి అన్నారు. ఇంకా ఈ పాఠశాల కోసం మాకు చేతనైనంత సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దివంగత యాదయ్య గౌడ్ కుమారుడు కిషోర్ కుమార్ గౌడ్ 10 లక్షల రూపాయలను పాఠశాల కొరకు, విద్యార్థుల కొరకు విరాళంగా ఇచ్చారు. అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహం కొరకు నగదు ఉపయోగపడుతుందని, పాఠశాలలో విద్యార్థులకు మంచినీటి సదుపాయం కొరకు ఆర్వో ప్లాంట్ సైతం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే స్కూల్ అప్రోచ్ రోడ్ అటవి శాఖ పరిధిలో ఉండటం వలన దారి సమస్య ఉన్నందున, దాన్ని కూడా ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలియజేశారు. పాఠశాలలో క్రీడల కోసం సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ నగదు ప్రోత్సాహంగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, తూళ్ళ వీరేందర్ గౌడ్, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పలువురు పాల్గొన్నారు.

## థంసప్(కూల్ డ్రింక్) లో గడ్డి మందు కలిపి భర్తను చంపిన భార్య

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట పట్టణం భవాని కుంట తండా కు చెందిన జాటోతు బాలాజీ(40) ఈ నెల 8 తేదీన దాటుడు పండుగ సందర్భంగా భార్య కాంతికి చికెన్ తెచ్చి వండమని తాను మద్యం సేవించి వస్తానని వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాక బాలాజీకి పథకం ప్రకారం ఇంట్లో ఉన్న గడ్డి మందును థంసప్(కూల్ డ్రింక్) లో కలిపి ఇవ్వగా తాగిన బాలాజీకి కొద్దిసేపటి తర్వాత గొంతు మండుతుందని అరుస్తుండగా మృతి చెందలేదని గమనించిన భార్య కాంతి(38) తన బావ అయిన వాంకుడోతు దస్రు (40) ఇంటికి వెళ్లి ఏమి తెలియనట్లు ఉంది. బాలాజిని గమనించిన కుటుంభం సభ్యులు ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందడంతో తండ్రి జాటోతు హరిచందర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వర్ధన్నపేట ఎస్.ఐ చందర్ తెలిపారు.




## చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

**ఇన్స్పెక్టర్ యం రంజిత్ కుమార్**

**హన్మకొండ మహా;** హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లకు మంగళవారం సుబేదారి ఇన్స్పెక్టర్ యం రంజిత్ కుమార్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ తగాదాల్లో తలదూర్చి బెదిరింపులకు పాల్పడిన, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించిన అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడి యాక్ట్ కింద కేసు నమోదు చేయడం జరుగుతుందని రౌడీషీటర్ల ను హెచ్చరించారు.



## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఇంటెలిజెన్స్ డిఐజీ

**వరంగల్ మహా;** ఇంటెలిజెన్స్ డిఐజి సన్నీ కుటుంబ సమేతంగా వరంగల్ నగరంలోని శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సాధారంగా స్వాగతం పలికి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట ఇంటలిజెన్స్ డి.ఎస్.పి కృష్ణ ప్రసాద్ ఎస్ఐ రవికుమార్ తదితరులు ఉన్నారు. పూజా అనంతరం ప్రధాన అర్చకులు తీర్థప్రసాదాల తోపాటు మహదాశీర్వచరణం అందించగా ఆలయ ఈవో శేషభారతి అమ్మవారి శేష వస్త్రాలు బహుకరించారు.

## డాక్టర్ ప్రత్యూష మృతి కేసులో నలుగురి అరెస్ట్

**వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి**



**హన్మకొండ మహా;** యువ వైద్యురాలు అల్లాడి ప్రత్యూష ఆత్మహత్యకు కారకులైన నలుగురిని హసన్ పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని కాకతీయ వెంటేజ్ లోని స్వగృహం లోనే వైద్యురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఈ సందర్భంగా హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ప్రశాంత్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ప్రత్యూష మృతికి కారకులైన భర్త డాక్టర్ అల్లాడి సృజన్, అతని తల్లితండ్రులు అల్లాడి మధుసూదన్, అల్లాడి పుణ్యవతితోపాటు బానోతు శృతి కారులో హనుమకొండకరీంనగర్ ప్రధాన రహదారిలో వెళ్లుండగా కాకతీయ వెంటేజ్ క్రాస్ సమీపంలో హసన్ పర్తి పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. మాటలతో ప్రేరేపించి డాక్టర్ ప్రత్యూష మరణానికి కారకులైన ఈ నలుగురిని కోర్టులో హాజరుస్తున్నట్లు ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో సీఐ చేరాలు, ఎస్సైలు దేవేందర్, రవి, క్రైమ్ కానిస్టేబుల్స్ క్రాంతి, వివేక్ పాల్గొన్నారు. కాగా అల్లాడి ప్రత్యూష ఆత్మహత్యకు ప్రేరేపించిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ వారిని విలేఖరుల ముందు హాజరు పర్చకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**ప్రత్యూష కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే**

ఆత్మహత్య చేసుకున్న డాక్టర్ ప్రత్యూష కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ అర్బన్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఆర్. దిలీప్ రాజ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంగళవారం వారి నివాసానికి వెళ్లి ప్రత్యూష చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ ప్రత్యూష ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి మనోధైర్యాన్ని కల్పించారు.

## హత్య కేసులో నిందితునికి జైలు శిక్ష

**భూపాలపల్లి , మహా :** భూపాలపల్లి మండలం కమలాపురం గ్రామ శివారు తాటి వనం వద్ద జరిగిన హత్య కేసులో నిందితుడిపై నేరం రుజువు అయినందున మంగళవారం నాడు భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ రమేష్ బాబు నిందితునికి 10 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.1000 జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు. 2020 మార్చ్ నెల రెండవ తేదీన భూపాలపల్లి మండలం కమలాపురం గ్రామానికి చెందిన రేగల్ల తిరుపతి(35), తన స్నేహితులతో కలిసి కమలాపురం గ్రామ శివారులో కల్లు త్రాగుతుండగా అదే గ్రామానికి చెందిన మాచర్ల రవి(40) గ్రామంలో ఉపాది హామి పనులు చేయకున్నా డబ్బులు తీసుకున్నందున తిరుపతి అడిగిన విషయం మనుసులో ఉంచుకొని కావాలని రేగల్ల తిరుపతితో గొడవపడి తన వద్ద ఉన్న కల్లుగీసే కత్తితో తిరుపతి చాతిలో పొడవగా అక్కడిక్కడే మృతి చెందారు. ఈ ఘటన పై మృతుని భార్య రేగల్ల కోమల భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో ధరఖాస్తు చేశారు. అప్పటి ఎస్ హెచ్ ఓ వాసుదేవరావు హత్య కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు సరియైన సాక్ష్యాధారాలలో కోర్టులో చార్జ్షీట్ ఫైల్ చేశారు. కోర్ట్ లైజన్ ఆఫీసర్ గాండ్ల వెంకన్న ఆధ్వర్యంలో కోర్టుకానిస్టేబల్ కళ్యాణి సరియైన సమయంలో సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్యాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడు మాచెర్ల రవికి పై శిక్షలు ఖరారు చేసినారు ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన భూపాలపల్లి డి ఎస్ పి సంపత్ రావు, ఎస్ హెచ్ ఓ నరేష్ కుమార్, అప్పటి దర్యాప్తు అధికారి వాసుదేవరావు,కోర్టు లైజన్ ఆఫీసర్, కోర్టు కానిస్టేబల్లను జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అభినందించారు.

## ప్రభుత్వ, పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్ల ఏర్పాటుకు చర్యలు

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్ మహా;** ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్లు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో కలెక్టర్ సమావేశమై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కట్టెల పొయ్యితో కాకుండా గ్యాస్ ద్వారా వంట చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 500 ప్రభుత్వ పాఠశాలల్లో గ్యాస్ సిలిండర్ కనెక్షన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అందుకు ఎల్పిజి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రతి మండలానికి సుమారు 35 నుండి 40 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నందున ఆయా మండల ఎల్పిజి ఏజెన్సీల నుండి గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసేలా చూడాలని ఎల్పిజి ఏజెన్సీ ప్రతినిధులను కోరారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆర్ బి ఎస్ కె ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో, కేజీబీవీ లలో విద్యార్థులకు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయుటకు సంబంధిత విద్యాసంస్థల సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డి ఆర్ డి ఓ కౌసల్యాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు జిల్లా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు, ప్రత్యేక అధికారులు మండల విద్యాశాఖ అధికారులు, కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండగకు విస్తృత ఏర్పాట్లు చేయండి

**నగర మేయర్ గుండు సుధారాణి**



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరవ్యాప్తంగా జరగనున్న శ్రావణ మాస పోచమ్మ బోనాల పండుగకు ఆలయాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రధాన కార్యాలయం లోని మేయర్ ఛాంబర్ లో ఇంజనీరింగ్, విభాగాల అధికారులతో త్వరలో జరుగనున్న శ్రావణ మాస పోచమ్మ బోనాల నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్ల పై సమావేశం లో మేయర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శ్రావణ మాసంలో పోచమ్మ బోనాల నేపథ్యంలో అమ్మ వారిని దర్శించుకునేందుకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నగరంలోని అన్ని ఆలయాలకు లైటింగ్ ఏర్పాట్లతో పాటు అంతర్గత రహదారులకు డస్టింగ్ వేయాలన్నారు. ఈ సందర్భంగా మేయర్ బల్దియాలోని 66 డివిజన్లలో పలు పథకాల క్రింద కొనసాగుతున్న అభివృద్ధి పనులపై డివిజన్లవారిగా. ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించి సకాలంలో పూర్తి చేయాలని, టెండర్ ప్రక్రియలోబన్న పనులను త్వరగా మొదలుపెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎస్ ఈ మహేందర్, ఈ ఈ లు శ్రీనివాస్, రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లత, తో పాటు డి ఈలు ఏ ఈలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ బిఐ లైఫ్ ఇన్సూరెన్సు.. జీవితంకి ఆధారమైన భీమా

**భూపాలపల్లి బ్రాంచ్ మేనేజర్ నల్లపురి హరికృష్ణ**




**భూపాలపల్లి, మహా :** ప్రతి ఒక్కరికి కనీసం అవసరాలు అయినా కూడు గూడు గుడ్డతో పాటు జీవిత భీమా కూడా తప్పని సరి అని ఎస్ బి ఐ లైఫ్ ఇన్సూరెన్సు భూపాలపల్లి బ్రాంచ్ మేనేజర్ ఎన్ హరికృష్ణ తెలిపారు. ఇటీవల ఆకస్మాత్తుగా కాటారం మండల కేంద్రంకి చెందిన ఎస్ కే సబ్దార్ అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందడం జరిగింది. సబ్దార్ గారు 50000 రూపాయల ప్రీమియం తో ఎస్ బి ఐ లైఫ్ ఇన్సూరెన్సు లో స్మార్ట్ స్కాలర్ పాలసీ తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సబ్దార్ ఆకస్మికంగా మృతి చెందడంతో నామిని భార్య సోని కి 5 లక్షల రూపాయల జీవిత భీమా మొత్తాన్ని అందచేశారు..అంతే కాకుండా పాలసీ కొనసాగుతుందని సబ్దరు చెల్లించవలసిన మిగిలిన 4 వాయిదాలు కూడా తమ కంపెనీ చెల్లించి మెచ్యూరిటీ మొత్తం చివరికి ఇవ్వడం జరుగుతుంది అని మేనేజర్ హరికృష్ణ తెలిపారు. ఎస్ బి ఐ లైఫ్ ఇన్సూరెన్సు లో చిల్డ్రన్ పాలసీ లతో పాటు ఇన్వెస్ట్మెంట్ ప్లాన్స్, పెన్షన్, టర్మ్ ప్లాన్స్, ట్రెడిషనల్ ప్లాన్స్ కూడా అందుబాటులో ఉన్నాయి అని దీనిని ప్రతి ఒక్కరు తమ అవసరాలకు మేరకు జీవిత భీమా పాలసీ లను ఎస్ బి ఐ లైఫ్ ఇన్సూరెన్సు ద్వారా పొందవలసింది గా వారు కోరారు. ఈ సందర్భంగా లైఫ్ మిత్ర గురువారెడ్డి గారు మాట్లాడుతూ సబ్దార్ గారు తనకేంతో ఆప్తుడు అని వారి మరణం తనను తీవ్రంగా కలిచివేసింది అని వారి కుటుంబానికి భీమా సౌకర్యం తో ఆర్థిక భద్రత కల్పించినందుకు సంతోషిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమం లో డెవలప్మెంట్ మేనేజర్స్ మాసు రమేష్, డోలి రామక్రిష్ణ, మల్లారపు మొండయ్య, కస్తూరి సాయికృష్ణ, బ్రాంచ్ లైఫ్ మిత్రలు గురువారెడ్డి, దేశిని శంకర్, బొడ్డు రాజబాబు, సుంకరి కుమార్, పబ్బ నాగరాజు, గోక విష్ణు వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి అంబులెన్స్ నడుపుతున్న డ్రైవర్

**కేసు నమోదు చేసిన మంచిర్యాల ట్రాఫిక్ పోలీసులు**

**మంచిర్యాల, మహా :** మద్యం సేవించి అంబులెన్స్ నడుపుతున్న డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల ట్రాఫిక్ ఎస్సై సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో వాహన తనిఖీల్లో భాగంగా పాలు వాహన డ్రైవర్లకు తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక అంబులెన్స్ వాహనాన్ని ఆపినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా అతడు మద్య సేవించి వాహనం నడిపినట్లు పరీక్షల్లో తేలిందని వివరించారు. దీనితో అతనిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వాహనాలు నడిపే వాహన దారులు ఆయా వాహన ధృవ పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సరైన ధ్రువపత్రాలు లేనట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సత్యనారాయణ హెచ్చరించారు.

## భూగర్భ గనులలో హాజరు శాతాన్ని పెంచాలి

**100 మాస్టర్లు నింపని 214 మందికి ఫ్యామిలీ కౌన్సెలింగ్**

**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియాలో భూగర్భగనులలో హాజరు శాతాన్ని పెంచి సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి పాటుపడాలని స్థానిక జీఎం జీ దేవేందర్ స్పష్టం చేశారు. మంగళవారం మందమర్రి సింగరేణి సి ఈ ఆర్ క్లబ్ లో 100 మాస్టర్లు నింపని 214 మందికి ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది యువకులు ఉద్యోగాలు లేక 5 వందల నుండి 8 రూపాయలకు కూలీ పనులు చేస్తున్నారని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన సింగరేణి ఉద్యోగికి ఒకరోజు విధులకు హాజరైతే దాదాపు 1500 రూపాయలు చెల్లిస్తుందని వెల్లడించారు. కొడుకు సింగరేణి బొగ్గు భాయ్ ఉద్యోగుడైతే వృద్ధాప్యంలో ఉన్న తమకు ఆసరవుతాడని అనుకుంటే వారికి నిరాశే కలుగుతుందని వాక్యానించారు. గతంలో ఉన్న మాదిరిగా భూగర్భ గనులలో పనులు లేవని తెలిపారు. గతంలో సింగరేణి కార్మికులు తట్ట మోసే క్రమంలో గాలి పని స్థలాలు సక్రమంగా లేక ఇబ్బందులు పడేవారని తెలిపారు. ప్రస్తుతం కార్మికులకు భూ గర్భ పని స్థలాల దగ్గరికి వెళ్లేందుకు మైండ్ రైడింగ్ సిస్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా కార్మిక కుటుంబాలకు వారి పిల్లలకు ఉచితంగా విద్య, వైద్యం, గృహం, విద్యుత్తు, నీరు తదితరులు అందిస్తున్నట్లు వెల్లడించారు.

# సిగాచి ప్రమాద మృతులకు పరిహారం చెల్లించాలి

**పరిశ్రమలు ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి**




**మంచిర్యాల, మహా :** సిగాచి ప్రమాద మృతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిఐటియు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందర నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఆందోళనకు ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, ఉపాధ్యక్షులు ప్రకాష్ లు మాట్లాడుతూ సీఐటీయు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. సిగాచి పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో 41 మంది పేదల ప్రాణాలు బుగ్గిపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా 34 మంది వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇంకా పదుల సంఖ్యలో కార్మికుల ఆచూకీ ఇప్పటికీ లభ్యం కాలేదని వివరించారు. కుప్పకూలిన భవనం శిథిలాల క్రింద ఎంతమంది మాంసం ముద్దలుగా మారారో ఇప్పటికీ అటు ప్రభుత్వం, ఇటు పరిశ్రమ లెక్క తేల్చలేకపోతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి కారణం యాజమాన్యం. ప్రభుత్వం బాధ్యత వహించాలి వారు డిమాండ్ చేశారు. నిన్నటివరకు సేఫ్టీ (రక్షణ)లో ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందింది అంటున్న సిగాచి లో ఇంత హఠాత్తుగా ఇంత పెద్ద పేలుడు సంభవించడానికి కారణం ప్రభుత్వ విధానాల ఫలితమే తప్ప మరొకటి కాదని అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో, పారిశ్రామిక అభివృద్ధి పేరుతో మొత్తం చట్టాలను మార్చివేసి, పరిశ్రమ యాజమాన్యాల ఇష్టారాజ్యంగా వ్యవహరించేందుకు అవకాశం కల్పించిన ఫలితమే ఈ ప్రమాదాల ఘటనని వాక్యానించారు. ప్రభుత్వ విధానంలో భాగంగానే యాదాద్రి భువనగిరి జిల్లా 'ప్రీమియర్ ఎక్స్ప్లోజివ్ ఫ్యాక్టరీ'లో ప్రమాదం జరిగి ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లా హత్నూరా ఎస్బి. కెమికల్ పరిశ్రమలో రియాక్టర్ పేలిన ప్రమాదంలో 7 మంది ప్రాణాలు కోల్పోయారు. జూలై 3న కాటేదాన్లోని తిరుపతి రబ్బర్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. సిగాచి ప్రాణాంతక ప్రమాదం జరిగిన రోజునే మేడ్చల్ జిల్లాలోని ఒక ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ఒకరు గాయపడి మృత్యువుతో పోరాడుతున్నారని పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా విశాఖ జిల్లాలో ఎలి పాలీమర్స్ పరిశ్రమ ప్రమాదంలో 12 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతను మర్చిపోయి, తప్పు అంతా యాజమాన్యాలదేనన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సిగాచి పరిశ్రమలో ప్రమాద సమయంలో 143 మంది కార్మికులంటే అందులో సగం మందికి పైగా ఆంధ్రా, ఒరిస్సా, బెంగాల్, ఉత్తరప్రదేశ్ నుండి వచ్చిన వలస కార్మికులే ఉన్నారని వెల్లడించారు. పాలకులు, పరిశ్రమల యాజమాన్యాలు తెలంగాణ రాష్ట్రంలో 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం ఎక్కడ అమలు చేయడం లేదని దృష్టికి తీసుకువచ్చారు. వివిధ పరిశ్రమల యజమానులు వలస కార్మిక చట్టాలను తుంగలో తొక్కి వారి శ్రమను దోపిడీ చేస్తున్నారు. ప్రమాదాలు జరిగిప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధపడటం, సంతాపం ప్రకటించడంతో సరిపోతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష్ , భాగ్య, పోసక్క తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలోని ఏవో కు అందజేశారు.

## కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐని వెంటనే జమ చేయాలి

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్**



**ఆదిలాబాద్, మహా:** రిమ్స్ లో పనిచేస్తున్న ఐ.హెచ్.ఎఫ్.ఎం.ఎస్ కాంట్రాక్టు కార్మికుల జూన్ నెల వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ ని వెంటనే జమ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కోరారు. ఈ మేరకు మంగళవారం రిమ్స్ కార్మికులతో కలిసి తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ రిమ్స్ కమిటీ ఆధ్వర్యంలో డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఐహెచ్ఎఫ్ఎంఎస్ కాంట్రాక్టు కాలం ముగిసిందని అధికారులు పత్రిక ముఖంగా ప్రకటించారు.... సదరు కాంట్రాక్టర్ మాత్రం సస్పెన్షన్ పై హై కోర్ట్ నుండి స్టే తెచ్చుకున్న నేపథ్యంలో గందరగోళ పరిస్థితి నెలకొందని వివరించారు. కార్మికుల్లో నెలకొన్న ఆందోళన తొలగించి వారి బాధ్యత ఎవరు తీసుకుంటారో స్పష్టం చేయాలని కోరారు. కార్మికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రిమ్స్ కార్యదర్శి పెద్ద దేవిదాస్, నాయకులు సురేందర్, పొచ్చన్న, ఖలీల్, రమేష్, రమాకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపించాలి

**బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డా.విశారదన్ మహారాజ్**



**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా వాసులు ఏళ్ళుగా ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్రలో భాగంగా చేపట్టిన పర్యటనలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటికి పరిష్కారం చూపాలని అన్నారు. డిమాండ్ల సాధనే లక్ష్యంగా మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర ద్వారా అనేక సమస్యలు తెలుసుకున్నామని అన్నారు. ముఖ్యంగా పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపాలని, అటవీదంగా ఏళ్ళుగా స్థానికులు పడుతున్న ఇక్కట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజల పక్షాన జేఏసీ తరఫున నిరంతరం పోరాడతామని స్పష్టం చేశారు. ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు అగ్గిమళ్ళ గణేష్, నేతలు గణేష్, సురేష్, సుష్మ, శ్యామల, మంజుషా, సంతోష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలి

**ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతల డిమాండ్**



**ఆదిలాబాద్, మహా:** ఎనిమిదో వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.శశికాంత్ మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రవేశ పెట్టిన ఆర్థిక బిల్లులో ఉద్యోగులు, పెన్షనర్లను విడగొట్టి వచ్చే పీఆర్సీ, డీఏల ఆర్థిక ప్రయోజనాలను పెన్షనర్లకు వర్తించవని పేర్కొనడం చట్ట విరుద్ధమన్నారు. దీని కారణంగా పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిదో వేతన సవరణ సంఘం నియమించడంతో పాటు నిబంధనలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కాలానికి సంబంధించి 18 నెలల కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, సమగ్రమైన వైద్య సదుపాయాలు ఉండేలా చూడాలని తెలిపారు. కోవిడ్ కంటే ముందు సీనియర్ సిటిజన్లకు కల్పించిన రైలు ప్రయాణ రాయితీలను పునరుద్దరించాలని పేర్కొన్నారు. పీఎం వయ వందన యోజన పథకాన్ని నిలిపివేయడం సరికాదని తెలిపారు. డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్, గౌరవ అధ్యక్షులు నూతల దయాకర్ రెడ్డి, గంగాధర్, బాపురావు, దేవిదాస్, రాజన్న, ఉమాకాంత్, షబ్బీర్, కాళ్ళ పురుషోత్తం, కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యమా?

**అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

**అభివృద్ధి పనులపై సమీక్ష**



**బాలాపూర్ మహా:** మహేశ్వరం నియోజకవర్గం లోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని గుర్రంగూడ, మామిడిపల్లి, మల్లాపూర్ గ్రామాల లో అభివృద్ధి పనులపై మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్స్, మంచినీటి సరఫరా, ఎస్ఎన్డీపీ నాలా వంటి కీలక అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనుల పై అధికారులను నిలదీశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై అధికారుల నుంచి స్పందన లేకపోవడం పై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికలు ప్రభుత్వం నిర్వహించకపోవడం తో పాలన కుంటిపడిందని ప్రజల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సబితా తెలిపారు. మున్సిపాలిటీలను ,జిహెచ్ఎంసిల లో కలుపుతారా లేదా అనే అంశం పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 సంవత్సరాల వరకు కార్పొరేషన్ గా ఉండాలని జిహెచ్ఎంసి లో కలుపవద్దని ప్రభుత్వానికి సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో బడంగ్ పేట్ మున్సిపల్ కమిషనర్ సరస్వతి, DE వెంకన్న, AE హరీష్, AO అరుణ, TPO కిరణ్, వర్క్ ఇన్స్పెక్టర్లు వినయ్ సంపత్, రాకేష్, కళ్యాణ్,మేనేజర్ నాగేశ్వరరావు తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం లోని కవ్వగూడా,పెద్ద గోల్కొండ, హమీదుల నగర్,జూకల్, చిన్న గోల్కొండ గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకొనగా మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి దాదాపుగా ( 3 లక్షల ) చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయనిధి అనేది ఒక వరం లాంటిది దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఆపద సమయాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చిన్న గోల్కొండ సొసైటీ ఛైర్మన్ దవణాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరటి రాజు, సొసైటీ డైరెక్టర్ శ్రీకాంత్ గౌడ్, చంద్రారెడ్డి, మహేందర్ ముదిరాజ్, కోటేశ్వర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, రమేష్ యాదవ్, సత్యానందం, శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోరు వద్దు... ఊరు ముద్దు

- మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు ఇద్దరు లొంగుబాటు
- లొంగిపోయిన ప్రతి నక్సలైట్ కు పునరావాసం కల్పిస్తాం
- రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝు వెల్లడి



**మంచిర్యాల, మహా :** పోరు బాట వద్దు...ఊరు బాట ముద్దని రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝు అన్నారు. మంగళవారం ప్రభుత్వ నిషేధిత మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆత్రం లచ్చన్న (గోపన్న) చౌదరి అంకు బాయ్ (లక్ష్మి) లు తమ సమక్షంలో లొంగిపోయినట్లు వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి ఆత్రం లచ్చన్న 1983 సంవత్సరంలో సిపిఐ ఎంఎల్ పీపుల్స్ వార్ లో దళసభ్యునిగా చేరి మొదటగా చెన్నూరు ధనంలో పనిచేశాడని తెలిపారు. 1988లో ఏరియా కమిటీ సభ్యునిగా పదోన్నతి పొంది సిర్పూర్ దళానికి డిప్యూటీ కమాండర్ గా పని చేసినట్లు వివరించారు. 1988 సంవత్సరంలో చౌదరి అంకు బాయ్ ఎలియస్ (అనితక్క) ను వివాహం చేసుకొని 1995లో టెక్నికల్ డిపార్ట్మెంట్ కి బదిలీ అయ్యాడని వివరించారు. ఇలా వివిధ హోదాలలో పనిచేసిన ఇతనిపై తెలంగాణలో 35 కేసులు ఉన్నాయని తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు తిరిగి వారి గ్రామాలకు వస్తే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పునరావాసం పథకాలు ఇతర సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. కొంతమంది వ్యక్తులు ప్రజాసంఘాల ముసుగులో శాంతి భద్రతలకు భంగం కలిగించే రీతిలో వ్యవహరిస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై నిఘ ఏర్పాటుచేసి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. హింసను ప్రేరేపించే సిద్ధాంతాన్ని ప్రజలు ఏనాడో తిరస్కరించారని వెల్లడించారు. ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలవండని ఆయన పిలుపునిచ్చారు. కాగా లొంగిపోయిన మావోయిస్టు ఆత్రం లక్షన్న స్వగ్రామం పారిపెల్లి, మండలం కోటపల్లి, మంచిర్యాల జిల్లా. చౌదరి అంకు బాయ్ స్వగ్రామం అగరగూడ, మండలం బెజ్జూర్, జిల్లా కొమురం భీం లని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల డిసిపి భాస్కర్ తదితర పోలీస్ అధికారులు ఉన్నారు.



## మంచిర్యాల ఆర్డీవోకు జిల్లా అదనపు కలెక్టర్ బాధ్యతలు

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్ రావు కు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శాఖ అదనపు బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా శ్రీనివాసరావు కొనసాగుతారని ఆయన వెల్లడించారు.




## నేరాల కట్టడికి పటిష్ట నిఘా

**శంషాబాద్ డీసీపీ రాజేష్**

**ఆమనగల్లు, మహా ::** నేరాల కట్టడికి గట్టి చర్యలు తీసుకుంటున్నామని శంషాబాద్ డిసిపి రాజేష్ చెప్పారు. మంగళవారం ఆమనగల్లు పోలీస్ స్టేషను సందర్శించి తనిఖీ చేశారు.అనంతరం రికార్డ్స్, క్రైమ్ రేట్ల వివరాలు,పోలీసు సిబ్బంది సంక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.నేరాలను అదుపు చేసేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలుతీసుకుంటుందన్నారు.పటిష్ఠ నిఘా ఉన్న ప్రాంతాలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏ సమస్య ఉన్నా పోలీస్ స్టేషన్లకు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలని, సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సైబర్ నేరాల కట్టడానికి కృషిచేయాలన్నారు. రానున్న గ్రామపంచాయతీ ఎలక్షన్ లను సందర్భంగా తగు సూచనలు చేశారు.ప్రజలకు శాంతి భద్రత కల్పించడంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిఐ జానకి రాంరెడ్డి, ఎస్ఐ వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడులు సహించేది లేదు

**టీడబ్ల్యూజెఎఫ్ ఆమనగల్ బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్**



**ఆమనగల్లు, మహా:** ప్రస్తుతం రాష్ట్రంలో జర్నలిస్టులపై కొంతమంది దాడులు చేస్తున్నారని వారిని సహించేది లేదని (టిడబ్ల్యూజేఎఫ్) తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆమనగల్ బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్నగర్ వార్త దినపత్రిక ఇంచార్జ్ కాజా పాషా వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, నిజాన్ని నిర్భయంగా రాసే జర్నలిస్టులపై కొంతమంది కావాలనే దాడులు చేస్తున్నారని వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఏలాంటి వేతనాలు లేకుండా సమాజం హితం కొరకు పనిచేస్తున్న జర్నలిస్టులపైనే దాడులు చేయడం అవివేకమని, భవిష్యత్తులో జర్నలిస్టులపై ఎలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

## సిలిండర్ నుంచి ఒక్కసారిగా మంటలు.. సామాన్లు దగ్ధం

**మంటలను అదుపు చేసిన స్థానికులు**



**రాజేంద్రనగర్, మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పద్మ శాలి పురం సాయి కాలనీ లో ఒక ఇంట్లో సిలిండర్ లోంచి అకస్మాత్తుగా మంటలు చేలరేగిన, సంఘటన మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. స్థానిక తెలిపిన వివరాలు ప్రకారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధి పద్మశాలి పురంలోని సాయి నగర్ కాలనీలో మహిళా వంట చేస్తుండగా ఒక్కసారి సిలిండర్ లో నుంచి మంటల చెలరేగడంతో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు భయాందోళనకు గురై గట్టిగా అరవడంతో స్థానికులు వెంటనే స్పందించిన సిలిండర్ ను ఇంట్లో నుండి బయటకు తీసుకొచ్చి, మంటలను అరిపేశారు. అగ్ని ప్రమాదంలో టి వి, కిచెన్ లో సామాన్లు అగ్నికి ఆహుతీ అయ్యాయి. ఫైర్ ఇంజన్ ను లేటుగా రావడంతో సామాన్లను ఖాళీ బూడిద అయ్యాయి. ఇంటి యజమాని రెగ్యులేటర్ పైప్ తెగిపోయిన దానిని ప్లాస్టిక్ టెప్ చుట్టి వాడుతున్నారని అగ్ని మాపక సిబ్బంది తెలిపారు. అగ్ని ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెగ్యులేటర్ని రోజువారీగా సరిచూసుకోవాలి, వాంట అయిపోగానే గ్యాస్ ను ఆఫ్ చేసి అగ్ని ప్రమాదాలను అరికట్టాలనీ అగ్నిమాపక సిబ్బంది సూచించారు

## చెరువులు, కుంటల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

**చెరువుల సుందరీకరణకు అధికారులకు పలు సూచనలు**

**మేయర్ తో కలిసి చెరువులను సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు**



**హన్మకొండ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్ పూర్ ఊరు చెరువును నగర మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు క్షేత్ర స్థాయి లో పర్యటించి చెరువు పునరుద్ధరణ, కబ్జాకు గురికాకుండా చేపట్టాల్సిన చర్యలను గురించి స్థానికులు, అధికారులతో మాట్లాడి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు ఊరు చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించి పూడికతీత, సుందరీకరణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, సి.ఎం.హెచ్ ఓ డా.రాజారెడ్డి హెచ్ ఓ రమేష్ ఈ ఈ సంతోష్ బాబు, ఏ సి పి ప్రశాంత్, ఇరిగేషన్ డి ఈ హర్షవర్ధన్ మున్సిపల్ డి ఈ లు రవికిరణ్, సతీష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## టీపీఓను బదిలీ చేయాలి

**మున్సిపల్ కమిషనర్‌కు బి.ఎస్.పి వినతి**

**మందమర్రి, మహా :** మందమర్రి మున్సిపాలిటీ లో విధులు నిర్వహిస్తున్న టిపిఓ లు బదిలీ చేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాజలింగుకు బిఎస్పి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల రాజేంద్రప్రసాద్ మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మందమర్రి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న టిపిఓ వారానికి రెండు రోజులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. అయితే తాను ఆ రెండు రోజులు కూడా పట్టణ ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో వివిధ పనులకు కార్యాలయానికి వచ్చే ప్రజల పనులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ టిపిఓ విధులకు సరిగా హాజరు కాకపోవడంతో మున్సిపాలిటీ విధులు నిర్వహిస్తున్న ముగ్గురు టీపీబివోలకు సూచనలు చేసే వారు లేరని తెలిపారు. దీనితో వారికి వృధాగా జీతభత్యాలు చెల్లించవలసి వస్తుందని పేర్కొన్నారు. డిప్యూటేషన్ పై వచ్చిన అధికారిని మార్చి పూర్తిస్థాయి టి పి ఓ ను నియమించాలని పట్టణ ప్రజల తరపున బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తుందని జిల్లా అధ్యక్షులు ముల్కల రాజేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ అధ్యక్షులు గాజుల శంకర్, ఎండి మతిన్ ఖాన్, ఎస్.కె రహీం బాబా పాల్గొన్నారు.

## నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలోని నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాల నిర్మాణా పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం వరంగల్ లోని పాత ఆజంజాహి మీల్స్ గ్రౌండ్లో నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయాలను సందర్శించి పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కలెక్టరేట్ కార్యాలయాల సముదాయాలలో మూడు అంతస్తుల నిర్మాణాలను, కలెక్టర్ క్వార్టర్స్, అడిషనల్ కలెక్టర్ క్వార్టర్స్ మొదటి, రెండవ అంతస్తులలో డిజైన్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అని పరిశీలించారు. స్ట్రక్చరల్ పనులు పూర్తయినందున ఫీనిషింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయుటకు అవసరమైన సిబ్బందిని వనరులను వినియోగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రోడ్లు, కాంపౌండ్ వాల్, పైప్ లైన్ తదితర నిర్మాణ పనులను కూడా ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా రోడ్ల భవన అధికారి రాజేందర్, డి ఈ శ్రీధర్ నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ సందీప్ రెడ్డి, తదితరులు, ఉన్నారు.

## ఎం.జి.ఎం.పి.పి యూనిట్ ఆకస్మిక తనిఖీ

**వరంగల్ డీఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ బి.సాంబశివరావు**



**వరంగల్ మహా;** వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ లోని ఆర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ పీ.పీ.యూనిట్ ను వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా పట్టణంలో పర్యటించినప్పుడు పరిసర ప్రాంతాలను పరిశీలించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అంతేకాకుండా జ్వరాల పట్ల ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.జీ.ఎం. పీ.పీ. యూనిట్ వైద్యాధికారి డాక్టర్ ఎం.యశస్విని, సూపర్వైజర్ నర్మద , రామ రాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.



## మత రాజకీయాలు సహించేది లేదు

- కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయం చేస్తోంది
- బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు

**మహా, తెలంగాణ:** కాంగ్రెస్ రిజర్వేషన్లు అడ్డం పెట్టుకొని మత రాజకీయాలకు తెరలేపిందని, వాటిని ఎట్టి పరిస్థితిలో సహించేది లేదని బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు వెల్లడించారు. నేడు ఘట్ కేసర్‌లోని ఔషాపూర్‌లో బిజెపి చీఫ్ రామచంద్రరావు అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర స్థాయి కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఎటువంటి వ్యూహాలను అమలు చేయాలో పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసారు. రామచంద్రరావు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అందులో 10 శాతం మతపరమైన రిజర్వేషన్లను కలపాలని చూస్తోందన్నారు. ఇది బీసీలకు వ్యతిరేకమైన చర్య అన్నారు. విద్యా, ఉద్యోగాల్లో మతపరమైన 4 శాతం రిజర్వేషన్లను బిజెపి గతంలోనే వ్యతిరేకించిందని గుర్తు చేసారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఓటు బ్యాంకు రాజకీయం కోసం ఇప్పుడు రాజకీయాల్లోనూ రిజర్వేషన్ల విధానాన్ని కొనసాగిస్తోందని మండిపడ్డారు.

## రైతులు రుణాలు సకాలంలో చెల్లించాలి

**సొసైటీ ఛైర్మన్ బుర్కుంటా సతీష్**

**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మండలం మల్కారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సొసైటీ ఛైర్మన్ బుర్కుంటా సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ధీర్ఘ కాలిక పంట రుణాల చెక్కులను సొసైటీ ఛైర్మన్ బుర్కుంటా సతీష్ రైతులకు అందజేశారు. రైతులు రుణాలు సకాలంలో చెల్లించి సహకారసంఘం అభివృద్ధికి తోడ్పాటు పడాలన్నారు. సంఘంలో నూతనంగా 14 మంది రైతులకు ధీర్ఘ కాలిక రుణాలు 1,35,00,000/ రూపాయలు మంజూరయ్యాయి, పంట ఋణం క్రింద 36 రైతులకు 49,80,000/ రూపాయలు పంపిణీ చేశారు. సొసైటీ రైతులు నూతనంగా ధరకాస్తులు పెట్టుకోవాలిని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రభుసాగర్, హీరేకర్ శివాజీ, లక్ష్మి కృష్ణారెడ్డి, ముదవత్ రెడ్యా, సహకార సంఘం సెక్రెటరీ సురేందర్, నీరటి విక్రమ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రధానమంత్రి సురక్ష బీమాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**మేనేజర్ తిరుపతి**

**ఆమనగల్లు, మహా:** సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనను ప్రజలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి అన్నారు. ఈ సంధ్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ సెక్యూ రిటీ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సంవ త్సరానికి రూ. 20 చెల్లించి ఏడాదికి రెండు లక్షల ప్రమాద బీమా పొందడానికి అవకాశం వుందన్నా రు. 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వరకు అర్హులు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన 436 సంవత్సరానికి రూ. 436 చెల్లించి రెండు లక్షల జీవిత బీమా పొందవచ్చని తెలిపారు. 18 నుండి 50 సంవత్సరాల వారు అర్హులు ఫిషింగ్ కాల్స్ ద్వారా సేవింగ్ కాల్స్ ద్వారా ఆన్లైన్ ద్వారా జరిగే ఫ్రాడ్స్ పై అవగాహన కల్పిస్తున్నమన్నారు. బ్యాంకు నుంచి ఎలాంటి ఓటీపీలు సివివి నెంబర్లు అడిగే అవకాశం ఉండదని సూచించారు.




# సైబర్ మోసాలకు చెక్ పెట్టేలా 5 జాగ్రత్తలు

దేశవ్యాప్తంగా కోట్లాది మందికి రోజువారీ లావాదేవీలను డిజిటల్ చెల్లింపులు సులభతరం చేశాయి. వాడకం పెరిగే కొద్దీ, డిజిటల్ చెల్లింపుల భద్రత పట్ల వినియోగదారుల్లో అవగాహన కూడా పెరగాల్సి ఉంది. సురక్షితమైన చెల్లింపు విధానాలను పాటించడం పెద్ద కష్టమేమీ కాదు. ఇవి వినియోగదారులకు డిజిటల్ భద్రతను అందిస్తాయి. డిజిటల్ చెల్లింపులను సురక్షితంగా జరిపేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) 5 జాగ్రత్తలను సూచిస్తోంది.

**లావాదేవీ ముందే సరిచూసుకోవడం..**

ఏదైనా డిజిటల్ పేమెంట్ చేసేటప్పుడు స్క్రీన్‌పైన కనిపించే పేరును తప్పకుండా తనిఖీ చేయాలి. మీరు ఎవరికైతే డబ్బు పంపిస్తున్నారో వారి పేరే స్క్రీన్ మీద ఉందో లేదో నిర్ధారించుకోవాలి. దీనికి పెద్దగా సమయం కూడా పట్టదు. తొందరపడి పొరపాట్లు చేయకుండా జాగ్రత్త పడాలి.

**ఆథరైజ్డ్ యాప్‌లు, వెబ్‌సైట్లే వాడేలా..**

ఎప్పుడూ అధికారిక యాప్‌లు లేదా వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే చెల్లింపులు జరపాలి. తెలియని వారు, లేదా మరేదైనా వెబ్‌సైట్‌లో సూచించిన విధంగా లింకుల ద్వారా యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ చేసి లావాదేవీలు చేయవద్దు.

**గోప్యంగా ఓటీపీ**

యూపీఐ పిన్ లేదా మెయిల్, ఫోన్‌కు వచ్చే ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్), లేదా బ్యాంక్ వివరాలు అత్యంత గోప్యమైనవని గమనించాలి. ఈ వివరాలు బ్యాంకు వారు కూడా అడగరని గుర్తించాలి. బ్యాంక్ నుండి కాల్ చేస్తున్నాం, లేదా పోలీసులం, లేదంటే ప్రభుత్వ కార్యాలయానికి చెందినవారం అని ఎవరైనా ఆయా వివరాలు అడిగితే స్కామర్లని వెంటనే తెలుసుకుని ఫిర్యాదు చేయాల్సి.

**హడావిడి పేమెంట్లు వద్దు..**

వెంటనే పేమెంట్ చేయాలని లేదా మీ వివరాలను అత్యవసరంగా ఇవ్వాలని ఎవరైనా మిమ్మల్ని తొందర పెడితే కంగారుపడకండి. కాస్త సమయం తీసుకోండి. ఒకటికి రెండుసార్లు సరిచూసుకోండి. అవసరమైతే వారికి తిరిగి కాల్ చేస్తానని చెప్పండి. మీకు కావాల్సినంత సమయం తీసుకోవడంలో ఎటువంటి తప్పు లేదు.

**పేమెంట్ అలర్ట్‌లను ఆన్ చేసుకోవడం..**

మీరు చేసే చెల్లింపులకు సంబంధించిన ఎస్ఎంఎస్, యాప్ నోటిఫికేషన్‌లను ఎప్పుడూ ఆన్ చేసి ఉంచండి. ప్రతి అలర్ట్‌ను జాగ్రత్తగా చదవండి. ఏదైనా తేడాగా అనిపిస్తే వెంటనే మీ బ్యాంక్ లేదా పేమెంట్ యాప్‌ను సంప్రదించండి.




# విదేశీ విస్తరణలో హీరో మోటోకార్ప్

ద్విచక్ర వాహనాల తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ అంతర్జాతీయంగా కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ద్వితీయార్ధంలో జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, బ్రిటన్ మార్కెట్లలోకి అడుగు పెట్టే ప్రణాళికల్లో ఉంది. 2024-25 వార్షిక నివేదికలో షేర్‌హోల్డర్లను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కంపెనీ చైర్మన్ పవన్ ముంజాల్ ఈ విషయాలు తెలిపారు. హీరో ఫర్ స్టార్టప్స్ తదితర సొంత వేదికల ద్వారా కొత్త తరం ఎంట్రప్రెన్యూర్లను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కొత్త ఉత్పత్తులు, సేవలపై పరిశోధనలు సాగించేందుకు, వాటిని అభివృద్ధి చేసేందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దక్షిణాసియా నుంచి లాటిన్ అమెరికా వరకు అంతర్జాతీయ మార్కెట్లలో 2024-25లో 43 శాతం వార్షిక వృద్ధి సాధించినట్లు ముంజాల్ వివరించారు. రిటైల్‌లో వ్యూహాత్మక విస్తరణతో ఎలక్ట్రిక్ స్కూటర్ విడా అమ్మకాలు 200 శాతం పెరిగాయని చెప్పారు. ఇక లిస్టెడ్ కంపెనీ ఏథర్ ఎనర్జీతో భాగస్వామ్యం కట్టడమనేది దేశీయంగా ఈవీ చార్జింగ్ నెట్‌వర్క్‌ను, ప్రీమియం ఎలక్ట్రిక్ వాహనాల సెగ్మెంట్‌లో స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు దోహదపడినట్లు పేర్కొన్నారు. అటు అమెరికన్ సంస్థ జీరో మోటర్‌సైకిల్స్‌తో భాగస్వామ్యం ద్వారా సరికొత్త ప్రీమియం మోటర్‌సైకిల్ వస్తోందని చెప్పారు. యూలర్ మోటర్స్‌లో రూ.510 కోట్ల పెట్టుబడి పెట్టడమనేది అంతర్జాతీయంగా ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ సెగ్మెంట్‌లో తమ కార్యకలాపాల విస్తరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

# పీఎస్‌యూ టెల్కోలకు లైన్ క్లియర్



పీఎస్‌యూ టెలికం దిగ్గజాలు బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్, ఐటీఐలకు మద్దతుగా అత్యున్నత కమిటీ మార్గదర్శకాలకు తెరతీసింది. దీంతో వేలం లేకుండానే ఇతర ప్రభుత్వ రంగ కంపెనీలకు మిగులు భూమి, భవనాలను బదిలీ చేసేందుకు వీలు చిక్కనుంది. గత నెలలో సమావేశమైన సెక్రటరీల కమిటీ ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. టెలికం పీఎస్‌యూ సంస్థల ఆస్తులను సొంతం చేసుకోవాలనుకునే ఇతర ప్రభుత్వ రంగ కంపెనీలు సంబంధిత అనుమతులతోపాటు ఆసక్తి వ్యక్తీకరణ బిడ్‌ను దాఖలు చేయవలసి ఉంటుంది. అంతేకాకుండా క్లెయిమ్‌ను రిజిస్టర్ చేసుకునేందుకు ఆస్తుల సంకేత విలువలో 2 శాతం సొమ్మును డిపాజిట్ చేయవలసి ఉంటుంది. ఆయా ఆస్తుల మానిటైజేషన్‌కు సంబంధిత వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ వెలువడిన 90 రోజుల్లోగా వీటిని పూర్తి చేయవలసి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు తొలి ప్రాధాన్యతా హక్కును వినియోగించుకునే వీలుంటుంది. అయితే నోటిఫికేషన్ వెలువడిన 90 రోజుల తదుపరి ఇతర ప్రయివేట్ రంగ కంపెనీలకు ఆస్తులను విక్రయించే వెసులుబాటును బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్, ఐటీఐ పొందుతాయి.




# మొన్న రూ.800 కోట్లు.. ఇప్పుడు రూ.1,600 కోట్లు

ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటలిజెన్స్(ఏజీఐ)ను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ (ఎంఎస్ఎల్)లో పని చేసేందుకు మెటా కళ్లు చెదిరిపోయే ప్యాకేజీలను ప్రకటిస్తోంది. యాపిల్, ఓపెన్‌ఏఐ, గూగుల్ డీప్‌మైండ్, ఆంత్రోపిక్..వంటి ప్రముఖ సంస్థలకు చెందిన ప్రపంచంలోని టాప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధకులను ఆకర్షించడమే లక్ష్యంగా రూ.800 కోట్ల నుంచి రూ.1,600 కోట్ల పరిహార ప్యాకేజీలను అందిస్తోంది. ఇటీవల మెటాలో చేరిన యాపిల్‌కు చెందిన రుమింగ్ పాంగ్‌కు రూ.1,600 కోట్లు (సుమారు 200 మిలియన్ డాలర్లు) పరిహార ప్యాకేజీని ఆఫర్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మెటా మాజీ ఓపెన్‌ఏఐ పరిశోధకుడు త్రపిత్ బన్సాల్‌కు రూ.800 కోట్లు (100 మిలియన్ డాలర్లు) ఆఫర్ చేసినట్లు తెలిసింది. కంపెనీ 'ఓసిరీస్' మోడళ్లను సృష్టించడంలో బన్సాల్ ప్రముఖ పాత్ర పోషించారు. మెటా ఈ ప్యాకేజీలను ధ్రువీకరించనప్పటికీ వేతనం, పరిహార బోనస్‌లు, స్టాక్ గ్రాంట్లు కలిపి కొన్ని కంపెనీల సీఈఓలు సంపాదించే వేతనంతో సమానంగా, అంతకుమించి ఉన్నాయని తెలుస్తుంది. గూగుల్, ఎక్స్, మెటా, ఓపెన్‌ఏఐ.. వంటి ప్రధాన కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా జనరేటివ్ ఏఐ మోడళ్లను సృష్టిస్తున్నాయి. ఈ సంస్థల మధ్య పోటీ తీవ్రతరం అవుతుంది. దాంతో తోటివారి కంటే ఓ అడుగు ముందుడాలనే భావనతో కంపెనీ ఏఐ నైపుణ్యాలున్నవారికి భారీ ప్యాకేజీలు ప్రకటిస్తున్నాయి. కృత్రిమ మేధస్సుపై ఆధిపత్యం చెలాయించే రేసులో భాగంగా మెటా కీలక ప్రచారం ప్రారంభించినట్లు ఇటీవల కొన్ని సంస్థలు తెలుపుతున్నాయి. ఈ విభాగంలో అగ్రశ్రేణి ఏఐ ప్రతిభావంతులను ఆకర్షించేందుకు భారీ ప్యాకేజీ ప్రకటిస్తున్నట్లు తెలుస్తుంది. మెరుగైన ఏఐ నైపుణ్యాలున్న ఎక్స్‌పర్ట్‌లకు ఎంత ప్యాకేజీ చెల్లించేందుకైనా వెనుకాడడం లేదని సమాచారం.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# బెంగళూరు ట్రాఫిక్ సమస్యకు ఇలా చెక్ పెట్టొచ్చు




మీరేప్పుడైనా బెంగళూరు వెళ్లారా? అబ్బో చాలాసార్లు వెళ్లాం.. చాలా చూశాం అంటారా? ఎన్నిసార్లు చూసినా మారనిది ఏంటని అక్కడికి వెళ్లొచ్చిన వారిని లేదా అక్కడే ఉంటున్న వారిని అడిగితే వచ్చే సమాధానం ఒకటే. అదే ట్రాఫిక్ సమస్య. దీని కారణంగా రోజులో ఎక్కువ సమయం రోడ్లపైనే గడపాల్సి వస్తుందని బెంగళూరు నగర వాసులు తరచుగా వాపోతుంటారు. ట్రాఫిక్ సమస్య కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను సోషల్ మీడియా వేదికగా ఏకరువు పెడుతుంటారు. ఒక్క బెంగళూరే కాదు దేశంలోని ప్రధాన మహా నగరాలన్నీ ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నాయి.

**సింగపూర్ మోడల్‌తో చెక్**

ఇండియా ఐటీ రాజధానిగా వెలుగొందున్న బెంగళూరు మహా నగరాన్ని చాలా కాలంగా ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. అయితే దీనికో పరిష్కారం ఉందంటున్నారు సాఫ్ట్‌వేర్ కంపెనీ 'జోహో కార్పొరేషన్' సీఈఓ శ్రీధర్ వెంబు. బెంగళూరులో ప్రతిపాదిత భారీ టన్నెల్ రోడ్డు ప్రాజెక్టు గురించి చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఎక్స్‌లో ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. సింగపూర్ అమలు చేస్తున్న ప్రజా రవాణా నమూనాతో భారత నగరాల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించవచ్చని ఆయన అంటున్నారు. ప్రైవేటు వాహనాలపై ఆంక్షలు విధించి, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని సూచిస్తున్నారు. "ప్రపంచంలోని అత్యంత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో సింగపూర్ ఒకటి. అత్యంత నివాసయోగ్యమైన నగరంగానూ పేరొందిన సింగపూర్.. ప్రజా రవాణాపై ఎక్కువగా ఆధారపడుతోంది. ప్రైవేటు వాహనాలపై నియంత్రణను పక్కాగా అమలు చేస్తోంది. కొత్తగా కారు కొనుగోలు చేసే వారు కచ్చితంగా సర్టిఫికెట్ ఆఫ్ ఎన్‌టైటిల్‌మెంట్ (COE) కలిగివుండాలి. ఈ సర్టిఫికెట్ ధర లక్ష సింగపూర్ డాలర్ల కంటే ఎక్కువ. ఇది కారు ధర కంటే అధికం. భారతీయ నగరాలు సింగపూర్ కంటే చాలా ఎక్కువ జనసాంద్రత కలిగి ఉన్నాయి. మన నగరాలను నివాసయోగ్యంగా మార్చడానికి విస్తృతమైన ప్రజా రవాణాను నిర్మించాలి. అది సాధ్యమే" అని ఎక్స్‌లో శ్రీధర్ వెంబు ((Sridhar Vembu) పోస్ట్ చేశారు. అయితే బెంగళూరులో ప్రతిపాదిత భారీ టన్నెల్ రోడ్డు ప్రాజెక్టు గురించి ఆయన నేరుగా ప్రస్తావించలేదు. కానీ బెంగళూరు లాంటి అత్యధిక జనసంద్రత కలిగిన నగరాల్లో బలమైన, సమ్మిళిత ప్రజా రవాణా అవసరాన్ని నొక్కి చెప్పారు.

**స్పందించిన ఎంపీ తేజస్వి సూర్య**

శ్రీధర్ అభిప్రాయంతో బెంగళూరు సౌత్ ఎంపీ తేజస్వి సూర్య (Tejasvi Surya) ఏకీభవించారు. రూ. 18,500 కోట్ల వ్యయంతో బెంగళూరులో ప్రతిపాదిత టన్నల్ రోడ్డు నిర్మాణాన్ని ఆయన వ్యతిరేకించారు. ఈ భారీ ప్రాజెక్ట్ వల్ల సామాన్యులకు ఒరిగేదేం లేదని, ప్రైవేట్ కార్లు కలిగి ఉన్న టాప్ 10% నివాసితులకు మాత్రమే ప్రయోజనం ఉంటుందని విమర్శించారు. దీనికి బదులుగా బెంగళూరు మెట్రోపాలిటిన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ), మెట్రో రైళ్ల విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ సూర్య సూచించారు. 'బెంగళూరులో 2031 నాటికి 16,580 BMTC బస్సులు అవసరం. కానీ మన దగ్గర కేవలం 6,800 మాత్రమే ఉన్నాయి. 2031 నాటికి 317 కిలోమీటర్ల పరిధిలో మెట్రో రైళ్లు నడవాలి. ప్రస్తుతం 78 కి.మీ. వరకే మెట్రో సేవలు పరిమితమయ్యాయ'ని తెలిపారు. 20కి పైగా నిలిచిపోయిన ఫ్లైఓవర్లతో పాటు నగరంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

**నెటిజన్ల రియాక్షన్**

ప్రభుత్వ రవాణా వ్యవస్థను మెరుగుపరిస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని శ్రీధర్ వెంబు వెలిబుచ్చిన అభిప్రాయంపై ఎక్స్‌లో నెటిజనులు స్పందించారు. ప్రజా రవాణా వ్యవస్థను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే.. ప్రజలు సహజంగానే ప్రైవేట్ వాహనాలకు దూరంగా ఉంటారని ఒక నెటిజన్ కామెంట్ చేశారు. మౌలిక సదుపాయాలంటే విశాలమైన రోడ్లు, ఫ్లైఓవర్ల మాత్రమే కాదని.. సంపన్నుల నుంచి సామాన్యుల వరకు ప్రయాణించేలా ప్రపంచ స్థాయి ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తేవాలని మరొకరు సూచించారు. నివాస ప్రాంతాల నుంచి వాణిజ్య సముదాయాలకు ప్రజా రవాణాను అనుసంధానిస్తూ నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని మరో నెటిజన్ అన్నారు. బెంగళూరు వంటి మహా నగరాల్లో కొత్తగా మౌలిక సదుపాయాలను కల్పించడం సులభమా, లేదా ఉన్న మౌలిక సదుపాయాలను మెరుగైనదిగా అప్‌గ్రేడ్ చేయడం సులభమా? అన్నది.. చూడాలని మరొకరు సూచించారు.

# రాహుల్ గాంధీకి బెయిల్ మంజూరు



**ఢిల్లీ:** భారత్ జోడోయాత్రలో నమోదైన కేసులో భాగంగా ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బెయిల్ మంజూరైంది. భారత్ జోడోయాత్రలో ఇండియన్ ఆర్మీని కించపరిచే విధంగా రాహుల్ వ్యాఖ్యలు చేశారనే పరువు నష్టం కేసులో ఆయనకు లక్నో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీనిలోభాగంగా రూ. 20 వేల పూచీకత్తు, రెండు బాండ్లు సమర్పించారు రాహుల్ గాంధీ న్యాయవాదులు. ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 13కు వాయిదా వేసింది కోర్టు. 2022, డిసెంబర్ 16వ తేదీన భారత్ జోడో యాత్రలో భాగంగా భారత్ ఆర్మీ సైనికుల్ని రాహుల్ కించ పరిచారంటూ పరువు నష్టం కేసు దాఖలైంది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్ ఉదయ్ శంక్ శ్రీవాస్తవ తరఫను వివేక్ తివారీ అనే న్యాయవాది రాహల్ వ్యాఖ్యలపై ఫిర్యాదు చేశారు. ఇండియన్ ఆర్మీని రాహల్ కించపరిచారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో భారత సైనికులను చైనా ఆర్మీ కొడుతున్నా భారత్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రాహుల్ జోడోయాత్రలో ప్రశ్నించారు. ఎల్‌వోసీ వెంబడి చైనా చర్యలకు భారత్ ఎందుకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని నిలదీశారు. ఈ వ్యాఖ్యలపైనే రాహుల్‌పై కేసు నమోదైంది. భారత్ ఆర్మీని కించపరిచారంటూ పరువు నష్టం కేసు దాఖలైంది. అదే సమయంలో దేశంలోని పలు చోట్ల రాహుల్ గాంధీపై ప్రత్యర్థి పార్టీలు రాజకీయ పిటిషన్లు దాఖలు చేశాయి. మరొకవైపు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఈ జనవరిలో ఊరట లభించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సుప్రీంకోర్టు స్టే విధించింది. 2019లో లోక్‌సభ ఎన్నికల సమయంలో జార్ఖండ్‌లోని చైబాసా పట్టణంలో బహిరంగ సభలో రాహుల్ మాట్లాడుతూ అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన హంతకుడు అని మండిపడ్డారు. రాహుల్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకుడు నవీన్ ఝా 2019లో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# భూమిపైకి శుభాంశు శుక్లా



**వాషింగ్టన్:** అంతరిక్షంలో భారత కీర్తిపతాకను సమున్నతంగా ఎగరేసిన మన ముద్దుబిడ్డ శుభాంశు శుక్లా నింగి నుంచి సగర్వంగా నేలకు తిరిగొచ్చాడు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో అడుగుపెట్టిన తొలి భారతీయునిగా చెరిగిపోని రికార్డును తన పేరిట లిఖించుకున్న శుభాంశు.. మరో ముగ్గురు సహచర వ్యోమగాములతో కలిసి సురక్షితంగా భూపైకి చేరుకున్నారు. యాక్సియం4 మిషన్ లో భాగంగా... అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు భూమిపైకి చేరుకున్నారు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 2.50 నిమిషాలకు కాలిఫోర్నియా సమీపంలోని సముద్ర జలాల్లో ల్యాండింగ్ అయ్యారు. డ్రాగన్ స్పేస్ క్యాప్స్‌లో భూమి మీదకు చేరుకున్నారు. వ్యోమగాములను ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించేందుకు స్పేస్ ఎక్స్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఐఎస్ఎస్ నుంచి ఘనంగా వీడ్కోలు**

ఐఎస్ఎస్‌లోని ఏడుగురు సహచర వ్యోమగాములు శుభాంశు బృందానికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆ సందర్భంగా పరస్పర కౌగిలింతలు, కరచాలనాలు ముగిసిన అనంతరం వాతావరణం ఉద్వేగపూరితంగా మారింది. 18 రోజుల పాటు కలిసి గడిపిన క్షణాలను అందరూ ఆనందంగా నెమరేసుకున్నారు. ముఖ్యంగా శుభాంశు రుచి చూపిన క్యారెట్, పెసరపప్పు హల్వాను ఎన్నటికీ మర్చిపోలేమని సహచరులు చెప్పుకొచ్చారు.

**జూన్ 25న శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర ప్రారంభం**

శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర జూన్ 25, 2025న ప్రారంభమైంది. అమెరికాలోని నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్9 రాకెట్ ద్వారా శుక్లా బృందం అంతరిక్షంలోకి వెళ్లింది. 28 గంటల ప్రయాణం తర్వాత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS)లోకి ప్రవేశించారు. అక్కడ పైలట్ శుక్లా నేతృత్వంలోని గ్రూప్ మొత్తం 60 రకాల శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించింది. ఇందులో శుక్లా ఒక్కరే స్వయంగా 7 ప్రయోగాలు నిర్వహించారు.

**ఫ్లోటింగ్ వాటర్ బబుల్**

శుభాంశు బృందం ఐఎస్ఎస్‌లో 18 రోజులు గడిపింది. ఆ క్రమంలో 60 కీలక ప్రయోగాలు చేపట్టింది. అంతరిక్షంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై శుక్లా అధ్యయనం చేశారు. మానవ జీర్ణవ్యవస్థ ఖగోళంలో ఎలా పని చేస్తుందనే అంశంపై భారత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక వీడియోను ఆయన రూపొందించారు. దాంతోపాటు నలుగురు వ్యోమగాముల బృందం తమ మానసిక స్థితిగతులపైనా ప్రయోగాలు చేసి చూసింది. ఆ క్రమంలో ఫ్లోటింగ్ వాటర్ బబుల్ తయారు చేసి అందులో గడిపింది. అది అద్భుతమైన అనుభవమని శుభాంశు గుర్తు చేసుకున్నారు. "ఐఎస్ఎస్‌లో ప్రతి క్షణాన్నీ పూర్తిగా ఆస్వాదించా. ముఖ్యంగా కిటికీ పక్కన కూచుని కిందకు చూడటాన్ని. బహుశా నా జీవితంలోకెల్లా అత్యంత అద్భుతమైన అనుభూతి అది" అని చెప్పారు. అంతరిక్షంలో వ్యవసాయం దిశగా కూడా వ్యోమగాములు పలు కీలక పరీక్షలు జరిపారు.

**76 లక్షల మైళ్లు..288 భూ ప్రదక్షిణలు**

శుభాంశు బృందం ఐఎస్ఎస్‌లో గడిపిన 18 రోజుల్లో భూమి చుట్టూ ఏకంగా 76 లక్షల మైళ్లకు పైగా ప్రయాణించింది. ఆ క్రమంలో 288 సార్లు భూప్రదక్షిణలు చేసింది. భూమికి తిరుగు ప్రయాణమయ్యే ముందు శుభాంశు ఐఎస్ఎస్‌లో వీడ్కోలు ప్రసంగం చేశారు. 41 ఏళ్ల ముందు రాకేశ్ శర్మ రూపంలో తొలి భారతీయుడు అంతరిక్షంలో కాలు పెట్టిన క్షణాలను, అక్కడినుంచి భారత్ కనిపించిన తీరును వర్ణించిన వైనాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. "మా తిరుగు ప్రయాణం సందర్భంగా ఈ రోజు ఆకాశం నుంచి భారత్ ఎలా కనిపిస్తుందో చూడాలని మా బృందమంతా ఉత్సాహపడుతోంది. నేటి భారత్ ఘనమైన ఆకాంక్షల భారత్. నిర్భయ భారత్. సగర్వంగా తలెత్తుకుని సాగుతున్న భారత్. అందుకే నేడు కూడా నా దేశం మిగతా ప్రపంచమంతటి కంటే మిన్నగా (సారే జహా సే అచ్ఛా) కనిపిస్తోందని చెప్పగలను" అంటూ నాడు రాకేశ్ శర్మ చేసిన వ్యాఖ్యలను శుభాంశు పునరుద్ఘాటించారు.



# లార్డ్స్‌లో లవ్ బర్డ్స్.. బాయ్‌ఫ్రెండ్‌తో ఆదిపురుష్ భామ సందడి!

ఆదిపురుష్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన బాలీవుడ్ ముద్దుగుమ్మ కృతి సనన్. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన మెప్పించింది. ప్రస్తుతం బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న భామ ప్రస్తుతం లండన్‌లో వాలిపోయింది. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న టీమిండియా మ్యాచ్‌లో తళుక్కున మెరిసింది. అయితే ఆమెతో పాటు బాయ్‌ఫ్రెండ్‌గా భావిస్తోన్న కబీర్ బహియా కూడా కనిపించారు. ఇద్దరు జంటగా కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో మరోసారి ఈ ముద్దుగుమ్మపై డేటింగ్ రూమర్స్ వినిపిస్తున్నాయి.

## కృతి-కబీర్ డేటింగ్ రూమర్స్

అయితే ఈ జంట ఇలా కనిపించడం ఇదేం మొదటిసారి కాదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బెంగళూరులో జరిగిన స్నేహితుడి వివాహానికి హాజరయ్యారు. అప్పట్లో వీరిద్దరు కలిసి వచ్చిన ఓ వీడియో నెట్టంట వైరలైంది. ఈ పెళ్లిలో కృతి సనన్- కబీర్ చాలా సన్నిహితంగా కనిపించారు. లండన్‌కు చెందిన వ్యాపారవేత్త అయినా కబీర్‌తో కలిసి చాలాసార్లు విహారయాత్రల్లోనూ కృతి కనిపించింది. అయితే వీరిద్దరికీ దాదాపు ఎనిమిదేళ్ల ఏజ్ గ్యాప్ ఉంది. ఈ జంట ప్రస్తుతం ప్రేమలో ఉన్నారని.. ఈ ఏడాదిలోనే వివాహం చేసుకోవాలని కూడా ప్లాన్ చేస్తున్నారని బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే మ్యాచ్‌లో పలువురు బాలీవుడ్ తారలు కూడా హాజరై సందడి చేశారు. హీరో అక్షయ్ కుమార్, ట్వింకిల్ ఖన్నా సైతం లార్డ్స్ టెస్ట్ మ్యాచ్‌కు హాజరయ్యారు. భారత క్రికెట్ జట్టు మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రితో కలిసి మ్యాచ్‌ను వీక్షించారు.



# టాలీవుడ్ హిట్ హీరో సరసన ట్రెండింగ్ బ్యూటీ!

ఒక్క సినిమా సక్సెస్‌తో ఓవర్ నైట్ అయిపోయిన హీరోయిన్లు చాలామంది ఉంటారు. రీసెంట్ టైంలో అలా 'డ్రాగన్' అనే తమిళ మూవీతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బ్యూటీ కాయదు లోహర్. ఈ చిత్ర విజయంతో ఈమెకు అటు తమిళం, ఇటు తెలుగులో మంచి ఆఫర్స్ వస్తున్నాయి. వీటితో పాటు ఇప్పుడు మరో క్రేజీ పాత్ర ఈమెని వరించినట్లు తెలుస్తోంది. ఇంతకీ ఏంటది? ఎవరా హీరో? అసోంకి చెందిన కాయదు లోహర్.. తెలుగులో ఇదివరకే 'అల్లూరి' అనే సినిమా చేసింది. కానీ ఇది ఫ్లాప్ అయ్యేసరికి తమిళంలో ప్రయత్నించింది. అక్కడ ఫేమ్ తెచ్చుకుంది. అలా మళ్లీ టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ప్రస్తుతం విశ్వక్ సేన్ 'ఫంకీ'లో ఈమె హీరోయిన్‌గా చేస్తోంది. ఇప్పుడు నాని నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'ప్యారడైజ్'లోనూ కాయదునే హీరోయిన్ అని తెలుస్తోంది. అనౌన్స్‌మెంట్ వీడియోతోనే అటెన్షన్ సొంతం చేసుకున్న 'ప్యారడైజ్'లో నాని.. ఇప్పటివరకు చూడని డిఫరెంట్ లుక్‌లో కనిపించబోతున్నాడు. రాఘవ్ జుయల్ అనే హిందీ నటుడు ఇందులో విలన్ అని రీసెంట్‌గానే ప్రకటించారు. మోహన్ బాబు, బాబు మోహన్ కూడా విలన్ పాత్రల్లో కనిపించబోతున్నారని లీక్స్ వచ్చాయి. ఇప్పుడు నానికి జోడిగా వేశ్య పాత్రలో కాయదు లోహర్ కనిపించబోతుందని అంటున్నారు. సాధారణంగా వేశ్య పాత్రలు అనగానే హీరోయిన్లు కాస్త వెనకడుగు వేస్తారు. కానీ కాయదు లోహర్ మాత్రం ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఈమెకు నానికి మధ్య బోల్డ్ సీన్స్ కూడా కాస్త ఎక్కువగానే ఉన్నాయని అంటున్నారు. ఒకవేళ ఇది నిజమై, కాయదు రోల్ ఆకట్టుకుంటే మాత్రం ఈమె దశ తిరిగిపోవడం గ్యారంటీ. మరి వీటిపై ఓ క్లారిటీ వస్తే తప్ప ఏం మాట్లాడలేం.



# ప్రతిష్టాత్మక నామినేషన్స్‌లో కల్కి.. ఆ చిత్రాలతో పోటీ!

టాలీవుడ్ మూవీ కల్కి 2898 ఏడీ చిత్రం సత్తా చాటింది. ప్రతిష్టాత్మక ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ నామినేషన్స్‌లో చోటు దక్కించుకుంది. తెలుగు సినీ పరిశ్రమ నుంచి ప్రభాస్‌నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన కల్కి ఉత్తమ చిత్రం విభాగంలో పోటీలో నిలిచింది. ఈ విభాగంలో హోమ్‌బౌండ్, ఎల్ 2 ఎంపురాన్, మహారాజ్, స్త్రీ2, సూపర్‌బాయ్స్ ఆఫ్ మాలేగావ్ సినిమాలతో పోటీ పడనుంది. అంతేకాకుండా ఉత్తమ నటుడు విభాగంలో మోహన్‌లాల్ (ఎల్ 2 ఎంపురాన్), అభిషేక్ బచ్చన్ (ఐ వాంట్ టు టాక్), ఆదర్శ్ గౌరవ్ (సూపర్‌బాయ్స్ ఆఫ్ మాలేగావ్), ఇషాన్ ఖట్టర్ (హోమ్‌బౌండ్), విశాల్ జెత్వా (హోమ్‌బౌండ్), జునైద్ ఖాన్ (మహారాజ్) పోటీలో నిలిచారు. ఉత్తమ నటి విభాగంలో అంజలీ శివరామన్ (బ్యాడ్‌గర్ల్), భనితా దాస్ (విలేజ్ రాక్‌స్టార్స్ 2), కరీనా కపూర్ (ది బకింగహామ్ మర్డర్స్), శ్రద్ధా కపూర్ (స్త్రీ 2), తిలోత్తమ షోమ్ (షాడోబాక్స్) పోటీ పడుతున్నారు. వీటితో పాటు బెస్ట్ వెబ్ సిరీస్, బెస్ట్ ఫీమేల్ యాక్టర్ (వెబ్ సిరీస్), బెస్ట్ మేల్ యాక్టర్ (వెబ్ సిరీస్) జాబితాను కూడా ప్రకటించారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డులను ఆగస్టు 14న ప్రకటించనున్నారు. ఈ వేడుకను ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ వేదికగా ఆగస్టు 14 నుంచి 24 వ తేదీ వరకు నిర్వహించనున్నారు.



# ప్రభాస్‌కి బయట తిరిగేంత టైమ్ కూడా ఉందా?

తెలుగు హీరోల్లో ప్రస్తుతం ప్రభాస్ అంత బిజీగా మరొకరు ఉండరేమో! ఎందుకంటే ఒకేసారి రెండు మూడు సినిమాలు చేస్తుంటాడు. ఇప్పుడు కూడా 'రాజాసాబ్', ఫౌజీ(వర్కింగ్ టైటిల్), స్పిరిట్ లైన్‌లో ఉన్నాయి. వీటిలో రాజాసాబ్.. ఈ ఏడాది డిసెంబరులో రిలీజ్ కానుంది. ఫౌజీ.. వచ్చే ఏడాది వేసవిలో రావొచ్చు. సరే ఇవన్నీ పక్కనబెడితే ప్రభాస్ సాధారణంగా బయటకు రాడు. అలాంటిది ప్రభాస్ ఎంచక్క హైదరాబాద్ థియేటర్‌లో సినిమా చూశాడు. స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో కలిసి ప్రభాస్.. 'ఎఫ్ 1' అనే హాలీవుడ్ మూవీ చూశాడు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్ థియేటర్‌లో వీళ్లిద్దరూ కనిపించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ పిక్స్ చూసిన అభిమానులైతే.. ప్రభాస్‌కి షూటింగ్స్ కాకుండా బయట తిరిగేంత సమయం కూడా ఉందా అని మాట్లాడుకుంటున్నారు. ఇంట్రవర్ట్ అయిన ప్రభాస్.. సినిమా ఫంక్షన్లకు తప్పితే పెద్దగా బయట కనిపించడు. అలాంటిది ఇప్పుడు సినిమా చూసేందుకు థియేటర్‌కి వచ్చాడని తెలిసి.. ఇంతలా మారిపోయాడేంటి అని కూడా నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు. ఇకపోతే ప్రభాస్‌ప్రశాంత్ నీల్ కాంబోలో 'సలార్' సినిమా వచ్చింది. దీనికి సీక్వెల్ కూడా రావాల్సి ఉంది. మరి ఇది ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందో అని ఫ్యాన్స్ వెయిటింగ్. ప్రశాంత్ నీల్ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో ఓ మూవీ చేస్తున్నాడు. దీని తర్వాత 'సలార్ 2' మొదలుపెడతాడేమో?



# అనారోగ్యంతో నిర్మాత సోదరుడు కన్నుమూత

తెలుగు నిర్మాత చిట్టూరి శ్రీనివాసరావు ఇంట్లో విషాదం నెలకొంది. ఈయన సోదరుడు చిట్టూరి కాశీవిశ్వనాథ్ (49) మృతి చెందారు. గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన.. ఈరోజు(జూలై 15) ఉదయం ఉమ్మడి గోదావరి జిల్లాలోని స్వగ్రామం పసివేదులలో తుదిశ్వాస విడిచారు. ఈ క్రమంలోనే పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. 2018లో సమంత నటించిన 'యూ టర్న్' సినిమాతో నిర్మాతగా మారిన చిట్టూరి శ్రీనివాసరావు.. తర్వాత 'ద వారియర్', స్కంద, సీటీమార్, కస్టడీ, నా సామి రంగ తదితర చిత్రాలని నిర్మించారు. ప్రస్తుతం మరికొన్ని మూవీస్ తీసే పనుల్లో బిజీగా ఉన్నారు. అలాంటిది ఇప్పుడు ఈయన సోదరుడు చనిపోవడంతో కుటుంబం మొత్తం విషాదంలో మునిగిపోయింది.

# చట్టప్రకారం చిరంజీవి దరఖాస్తు పరిష్కరించండి: హైకోర్ట్



మెగాస్టార్ చిరంజీవి తన ఇంటి పునరుద్ధరణలో భాగంగా చేపట్టిన నిర్మాణాలను క్రమబద్ధీకరించాలని కొద్దిరోజుల క్రితం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, తాజాగా జీహెచ్‌ఎంసీకి హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. చట్ట ప్రకారం పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. జూబ్లీహిల్స్‌లో ఉన్న చిరు ఇల్లు పునరుద్ధరణ చర్యల్లో భాగంగా రిటెయిన్ వాల్ క్రమబద్ధీకరణకు జూన్ 5న జీహెచ్‌ఎంసీకి దరఖాస్తు చేసుకున్నారు. కానీ, అక్కడి నుంచి ఎలాంటి స్పందన లేదంటూ చిరంజీవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ఇటీవల విచారణ జరిపారు. చిరంజీవి తరఫు న్యాయవాది వాదనల ప్రకారం.. 2002లో అనుమతి తీసుకుని జీ+2 ఇంటిని చిరు నిర్మించారని తెలిపారు. అయితే, పునరుద్ధరణలో భాగంగా ముందస్తు జాగ్రత్త చర్యగా అనుమతులు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో చిరు ఇంటి నిర్మాణాన్ని తనిఖీ చేసి క్రమబద్ధీకరించాలని కోరినా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోలేదని కోర్టుకు ఆయన తెలిపారు. చిరంజీవి దరఖాస్తును నాలుగు వారాల్లోగా పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీని అధికారులను హైకోర్ట్ ఆదేశించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com